RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ 14 ఆగస్ట్ 2026 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:66




## మోదీ, రాహుల్ గాంధీ సభలో ఉండగా..

## పార్లమెంట్ చరిత్రలో కొత్త అధ్యాయం!



పార్లమెంట్ చరిత్రలో గురువారం అరుదైన ఘట్టం చోటుచేసుకుంది. వర్షాకాల సమావేశాల చివరి రోజు లోక్‌సభ కార్యకలాపాలు తొలిసారి 'వందేమాతరం'తో ప్రారంభమయ్యాయి. ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సహా సభ్యులంతా సభలో ఉండగా ఆరు చరణాల జాతీయ గీతాన్ని ఆలపించారు.'వందేమాతరం' ఆలాపన పూర్తయ్యాక లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడింది. రాజ్యసభ కూడా జాతీయ గేయంతోనే సమావేశాలను ముగించింది. దీంతో పార్లమెంట్ చరిత్రలో కొత్త అధ్యాయం నమోదైంది.

'వందేమాతరం'కు చట్టబద్ధ రక్షణ కల్పించిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ గేయాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం, పాడకుండా నిరోధించడం నేరంగా పరిగణించేలా కొత్త చట్టం తీసుకొచ్చారు.

కేంద్ర హోంశాఖ జనవరి 28న 'వందేమాతరం' ఆలాపనపై మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాక ఆవిష్కరణ, గవర్నర్ల ప్రసంగాలు వంటి సందర్భాల్లో ఆరు చరణాలు ఆలపించాలని అందులో సూచించింది.

అయితే వర్షాకాల సమావేశాలు మాత్రం తీవ్ర రాజకీయ వేడితో సాగాయి. జులై 20న సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి పలు అంశాలపై అధికార, విపక్షాల మధ్య వాగ్వాదాలు జరిగాయి. సభా కార్యక్రమాలు పలుసార్లు స్తంభించాయి.

చివరి రోజు కూడా విపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్లమెంట్ ప్రాంగణంలోని మకర ద్వారం వద్ద బీజేపీ, విపక్షాలు వేర్వేరుగా నిరసనలు చేపట్టాయి. ఈ గందరగోళం మధ్యే 'వందేమాతరం'తో సభ ప్రారంభం కావడం ఈ సమావేశాల చివరి రోజుకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది.

# వచ్చే ఏడాది ఇందిరమ్మ టవర్స్ నుంచే బోనాలు ఎత్తిస్తాం

**ఎటువంటి లాలూచీ లేకుండా పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు.**

**గత ప్రభుత్వం పేదలను దోచుకుంటే ...**

**ఇందిరమ్మ ప్రభుత్వం పేదలకు ఇల్లు ఇస్తోంది**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి

హైదరాబాద్:- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నేడు శంకుస్థాపన చేసుకున్న ఇందిరమ్మ టవర్స్ నుంచి వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

గురువారం సాయంత్రం కూకట్పల్లిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం కమిషన్లు రావన్న కారణంగా పేదలకు ఇళ్ళు కట్టలేదని, కమిషన్లు వచ్చే కాలేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి సారించిందని ఆరోపించారు. దీనికి భిన్నంగా ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఎకరా 200 కోట్ల రూపాయల వరకు ఉన్నప్పటికీ హైదరాబాద్ మహానగరంలో పెద్ద పెద్ద టవర్స్ పక్కనే పేదలకు కూడా ఇళ్లు నిర్మించాలని నిర్ణయించి ఆచరణలోకి తెచ్చిందన్నారు. హస్తం పార్టీ రాష్ట్ర ప్రజలకు నేస్తమని మంత్రి గుర్తుచేస్తూ ఈ ప్రభుత్వం తల తాకట్టు పెట్టి అయినా పేదలకు ఇళ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియగా చేపడుతుందన్నారు. తొలివిడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి సంకల్పించామని దీనికి సంబంధించి ఇప్పటి వరకు 51 వేల దరఖాస్తులు వచ్చాయని, మరో రెండు రోజుల్లో దరఖాస్తులు స్వీకరణ గడువు ముగుస్తుందని అన్నారు. ఆ కార్యక్రమం తర్వాత అందరి సమక్షంలో ఎటువంటి లాలూచీలు లేకుండా పారదర్శకంగా మంత్రులతో సైతం ఎవరి సిఫార్సులు లేకుండా అందరి ముందు లక్కి డిప్ తీసి ఇళ్లను కేటాయిస్తామని చెప్పారు. లబ్ధిదారులకు ముందే ఇళ్ల వివరాలను అందిస్తాం కాబట్టి వారు దగ్గరుండి కాంట్రాక్టర్ తో నాణ్యంగా తమ ఇళ్ళను కట్టించుకోవచ్చునని సూచించారు .ఇటువంటి బృహత్తర కార్యక్రమాన్ని గత ప్రభుత్వ పాలకులు జీర్ణించుకోలేక కక్షపూరితంగా గుడ్డ కాల్చి నెత్తిన వేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల ఇళ్ల గృహప్రవేశాలు పూర్తయ్యాయని గుర్తు చేస్తూ గత ప్రభుత్వం పదేళ్లలో నిర్మించిన ఇళ్ల కంటే మరో రెండున్నర ఇళ్లలో మూడింతలు ఎక్కువగా ఇళ్లు నిర్మిస్తామని ,అది చేయకపోతే తాను శాసనసభకు పోటీ చేయనని మరోసారి మంత్రి పొంగులేటి ప్రకటించారు. గతంలోనే ఈ ఛాలెంజ్ విసిరినప్పటికీ కిందర్ కింగ్ దీన్ని స్వీకరించలేదని, ఆయన నుంచి ఎటువంటి స్పందన లేదని అన్నారు. అంతేగాక సొల్లు పురాణం సొల్లు కథలు చెబుతూ పేదలను పేదల ఆత్మగౌరవాన్ని కించపరుస్తున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో కొన్ని భూములు నిషేధిత జాబితాలో ఉన్నట్లు శాసనసభ్యులు తమ దృష్టికి తీసుకువచ్చారని అవి ప్రభుత్వ భూములు కాకపోతే రెండు రోజుల్లోనే ఆ భూములపై నిషేధం తొలగిస్తామని మంత్రి హామీ ఇచ్చారు

## విదేశాంగ విధానమంటే ఆలింగనాలు కాదు:

## మోదీపై రాహుల్ గాంధీ విమర్శలు

**ప్రధాని నరేంద్ర మోదీ తీరుపై రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు**

**వేదికపైనే కాంగ్రెస్ నేతను కౌగిలించుకుని సెటైర్**

**చైనా, ఇరాన్ విషయంలో భారత వైఖరిని తప్పుపట్టిన రాహుల్**

**బీజేపీ, ఆరెస్సెస్‌ను జోకర్ల బృందంగా అభివర్ణన**




ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రపంచ దేశాల అధినేతలను ఆలింగనం చేసుకోవడం, వ్యక్తిగత స్నేహాలను ప్రదర్శించడం విదేశాంగ విధానం అనిపించుకోదని, దేశ ప్రయోజనాలను కాపాడటమే అసలైన దౌత్యమని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో జరిగిన 'రచనాత్మక్ కాంగ్రెస్' జాతీయ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

విదేశాంగ విధానమంటే విదేశీ నేతలను కౌగిలించుకోవడమన్న ఆలోచన మోదీకి ఎక్కడి నుంచి వచ్చిందో అర్థం కావడం లేదని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా తన వాదనను వివరించేందుకు వేదికపై ఉన్న రచనాత్మక్ కాంగ్రెస్ చీఫ్ సందీప్ దీక్షిత్‌ను ఆయన ఆలింగనం చేసుకున్నారు. తన నాయనమ్మ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో కలిసి బాల్యంలో అమెరికా వెళ్లిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ, దేశాధినేతల అధికారిక పర్యటనలు వ్యక్తిగత పర్యటనలు వంటివి కావని ఆయన పేర్కొన్నారు.

ఇరాన్, అమెరికా, రష్యాలతో భారత్‌కు సుహృద్భావ సంబంధాలు ఉన్నప్పటికీ, ఇరాన్ వివాదంలో మధ్యవర్తిత్వం వహించే అరుదైన అవకాశాన్ని భారత్ కోల్పోయిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని సరిహద్దు ప్రాంతాల్లో భారత సైన్యం పెట్రోలింగ్‌ను చైనా అడ్డుకుంటోందని, గల్వాన్ ఘర్షణల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి దేశాన్ని బలహీనపరిచిందని ఆయన విమర్శించారు.బీజేపీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్)లను ఒక 'జోకర్ల బృందం'గా అభివర్ణించిన రాహుల్ గాంధీ, ఆ సంస్థలు దేశంపై ఏకపక్ష రాజకీయ వ్యవస్థను రుద్దేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఇదే కార్యక్రమంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, పార్లమెంటులో ప్రతిపక్షాల గొంతును ప్రభుత్వం విస్మరిస్తోందని మండిపడ్డారు.

# బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు'

**119 నియోజకవర్గాల్లో 1.19 లక్షల ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీకి శ్రీకారం**

**ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తుల స్వీకరణ**

**100 శాతం సబ్సిడీపై ఒక్కో కుట్టు మిషన్ విలువ రూ.12 వేలు**

**బీసీ మహిళల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చి ఆర్థిక వృద్ధి సాధించడమే లక్ష్యం: మంత్రి పొన్నం ప్రభాకర్**



మిగతా 2 లో

బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, కుట్టు వృత్తి ద్వారా స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా పాలన ప్రభుత్వంలో బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించి, వారిని కేవలం ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# ప్రజాబలం

14 ఆగస్ట్ 2026 శుక్రవారం


## డ్రగ్స్ ముప్పు నుంచి బయిటపడేదెలా..

తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ సమస్య ఇంతింతై వటుడింతై అన్నట్టుగా విస్తరిస్తోంది. మొదట్లో హైదరాబాద్ కు మాత్రమే పరిమితం అనుకున్న డ్రగ్స్ ఇప్పుడు.. ఎడాపెడా ఎక్కడపడితే అక్కడ పట్టుబడుతున్నాయి. చివరకు డ్రగ్స్ పెడ్లర్లలో డాక్టర్లు, టీచర్లు, విద్యార్థులు కూడా ఉండటం అందర్నీ అవాక్కయ్యేలా చేస్తోంది. అంతకుముందు పబ్బులు, క్లబ్బుల్లో మాత్రమే డ్రగ్స్ దందా జరుగుతోందనే భ్రమలో ఉన్న అధికారులకు.. ఇటీవలి కేసులు కళ్లు తెరిపిస్తున్నాయి. ఉదాహరణకు వీకెండ్‌లో డాక్టర్లంతా ఓ చోట కలుస్తుంటారు. అది పైకి సాధారణ గెట్‌టుగెదర్‌లాగే ఉంటుంది. కానీ పొరపాటున పోలీసులొస్తే.. వారంతా కంగారు పడతారు. పరారవటానికి ప్రయత్నిస్తారు. అలాంటి సందర్భాల్లో డాక్టర్ల దగ్గర డ్రగ్స్ దొరకటం చూసి పోలీసులు విస్తుపోతున్నారు. అదే సమయంలో స్కూలు బ్యాగ్‌లు, కాలేజీ క్యాంటీన్లలో డ్రగ్స్ పట్టుబడే కల్చర్ కూడా బాగా పెరిగిపోయింది. ఇప్పటికే చాలాసార్లు విద్యాసంస్థల యాజమాన్యాలకు పోలీసులు వార్నింగ్ ఇచ్చినా.. ప్రతి విద్యార్థిని 24 గంటలు తాము మాత్రం ఎలా గమనించగలమని అవి చేతులెత్తేశాయి. చివరకు క్యాంపస్‌లో డ్రగ్స్ దొరక్కుండా జాగ్రత్తపడుతున్నాయి. కానీ డ్రగ్స్ మత్తుకు అలవాటుపడ్డ విద్యార్థులు ఏదో మార్గంలో డ్రగ్స్ తీసుకుంటూనే ఉన్నారు. విద్యార్థుల సౌకర్యం కోసం.. డ్రగ్స్ చాక్లెట్లు, డ్రగ్స్ సిగరెట్లు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. అధికారులు డ్రగ్స్‌కు ఓ తలుపు మూసేస్తే.. మరో నాలుగు తలుపులు తెరుచుకుంటున్నాయి. అందుకే టాస్క్ ఫోర్స్, ఈగల్ పేరుతో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసినా.. అనుకున్న స్థాయిలో డ్రగ్స్‌ను కట్టడి చేయడం సాధ్యం కావడం లేదు.విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన టీచర్లు..చేయాల్సిన పని వదిలిపెట్టి స్టూడెంట్స్ కు డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. కేరళలోని వడకరలో రెండ్రోజుల క్రితం వెలుగులోకి వచ్చిన రవాణలో కేసులో ముగ్గురు టీచర్లతో సహా ఓ డెలివరీ బాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు.దర్యాప్తులో భాగంగా నిందితుల వాట్సాప్ మేసేజ్ లు, బ్యాంకు అకౌంట్ల ట్రాన్సాక్షన్లు పరిశీలించిన పోలీసులు..డ్రగ్స్ సరఫరా వెనుక కింగ్ పిన్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన టీచర్లు ఇలాంటి అక్రమాలకు పాల్పడటం, డబ్బు కోసం అడ్డదారులు తొక్కడం వారి వ్యక్తిగత జీవితాలనే కాదు.. యువత భవిష్యత్తును కూడా నాశనం చేస్తుంది డ్రగ్స్ కొనుగోలుకు కావాల్సిన డబ్బుకోసం వాటి విక్రయానికి సిద్ధపడుతున్నారు. దొంగతనాలు, దోపిడీలకూ తెగబడుతున్నారు. గంజాయి మత్తు తలకెక్కి రాత్రిళ్లు వీధుల్లో గొడవలకు దిగుతూ భయోత్పాతం సృష్టిస్తున్నారు. జీవితాలు అల్లకల్లోలమై ఆఖరికి ఆత్మహత్యలకూ పాల్పడుతున్నారు. కాసుల యావతో జాతి భవితవ్యాన్ని చీకట్లోకి నెడుతున్న డ్రగ్స్ కింగ్ పిన్లకు త్వరగా శిక్షలు పడకపోతుండటం వల్లే డ్రగ్స్ వెల్లువకు అడ్డుకట్టవేయడం సాధ్యపడట్లేదు.ఎన్‌డీపీఎస్ చట్టం కింద 2022–24 మధ్య దేశవ్యాప్తంగా మూడు లక్షల కేసులు నమోదయ్యాయి. 3.75 లక్షల మంది అరెస్టయ్యారు. కానీ, 268 మందికే శిక్షలు పడ్డాయి. తనిఖీలు, నమూనాల జప్తు, తరలింపుల్లో లోపాలు, ఫోరెన్సిక్ పరీక్షల్లో ఆలస్యం వంటివి దుర్మార్గులకు వరమవుతున్నాయి. చాలా రాష్ట్రాల్లో ప్రత్యేక ఎన్‌డీపీఎస్ కోర్టులు లేకపోవడం వల్లా కేసుల మేటలు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం సంబంధిత కేసులు నాలుగు లక్షల వరకు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ వీలైనంత త్వరగా కొలిక్కి రావాలంటే– అవసరానికి తగినట్లు అన్నిచోట్లా స్పెషల్ కోర్టులను ఏర్పాటుచేయాలి. డ్రగ్స్ కేసుల దర్యాప్తులో సిబ్బందికి తగిన శిక్షణ అందించాలి. మాదకమూకల పీచమణచడంలో అన్ని రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాలి. అన్నింటికన్నా ముఖ్యంగా తల్లిదండ్రులు తమ బిడ్డలు ఏం చేస్తున్నారో కనిపెట్టుకుని ఉంటూ, వారి ప్రవర్తనలో మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలి. ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి డ్రగ్స్ వల్ల తలెత్తే దుష్పరిణామాలపై విద్యార్థులకు అనునిత్యం అవగాహన కల్పిస్తూ, వారిని సరైన దారిలో నడిపించాలి. లేకపోతే భావి భారతం మనం ఊహించలేనంత ప్రమాదకరంగా మారుతుందని చెప్పటానికి సంకోచించాల్సిన పని లేదు.ఈ కారణంగానే ఐఐటీ , ఐఐఎంలతో సహా దేశంలోని ఉన్నత విద్యాసంస్థల్లో పెరుగుతున్న డ్రగ్ కల్చర్ కు చెక్ పెట్టేందుకు కేంద్రం సిద్దమవుతోంది. ఇందులో భాగంగా ఐఐటీ, ఐఐఎంలతో ప్రారంభించి అన్ని ఉన్నత విద్యాసంస్థల్లోనూ విద్యార్థులకు అడ్మిషన్ల సమయంలోనే స్వచ్ఛంద డ్రగ్స్ టెస్టులు నిర్వహించబోతున్నారు. ఈ మేరకు కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. ఆయా సంస్థల్లో అడ్మిషన్లు కోరే అభ్యర్థులు తమ అడ్మిషన్ పత్రాలతో పాటు యాంఫెటమైన్లు, కొకైన్, గంజాయి, బెంజోడయాజెపైన్లు, ఫెన్సైక్లిడిన్ వంటి మాదకద్రవ్యాల నిర్ధారణకు స్వచ్ఛందంగా యూరిన్ టెస్ట్ చేయించుకోవాలి. కేంద్ర విద్యా శాఖకు చెందిన ఉన్నత విద్యా విభాగం చేపట్టిన ఈ కార్యక్రమం, దేశంలో మాదకద్రవ్యాల సమస్యను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా చెప్తున్నారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో మాదకద్రవ్యాల నియంత్రణ విజన్ డాక్యుమెంట్ 2026–29లో దీన్ని జత చేశారు. దీని ప్రకారం వచ్చే మూడేళ్లలో కేంద్ర నిధులతో నడిచే 170 ఉన్నత విద్యా సంస్థలలోని సుమారు 10 లక్షల మంది విద్యార్థులకు దశలవారీగా డ్రగ్స్ పరీక్షలు నిర్వహిస్తారు.2029 నాటికి 10 లక్షల మంది విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగంపై పరీక్షలు నిర్వహించే మిషన్ ను ప్రధాని మోడీ ఆగస్టు 2న ప్రారంభించారు. దీనికి నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్‌గా పేరు పెట్టారు. ఢిల్లీ ఎయిమ్స్ లోని నేషనల్ డ్రగ్ డిపెండెన్స్ ట్రీట్‌మెంట్ సెంటర్ ఈ మేరకు కాలేజీలు, వర్సిటీల విద్యార్థులకు డ్రగ్స్ పరీక్షల కోసం మార్గదర్శకాలు ఇచ్చింది. ఇందులో డ్రగ్స్ పరీక్ష పూర్తిగా స్వచ్ఛందంగా, గోప్యంగా ఉండాలని, పరీక్ష చేయించుకునే విద్యార్థులపై ఎటువంటి ప్రతికూల పరిణామాలకు దారితీయకూడదని, దీనిని కేవలం కౌన్సెలింగ్ ప్రయోజనాల కోసం మాత్రమే ఉంచాలని సూచించింది. ఈ డ్రగ్ పరీక్షల కార్యక్రమం మూడు దశల్లో అమలు చేస్తారు. మొదటి దశలో ఈ ఏడాది ఐఐటీలు, ఐఐఎంలు, ఒక సెంట్రల్ యూనివర్శిటీలో చేపడతారు. వచ్చే ఏడాది 32 ఎన్ఐటీలు, ఎనిమిది ఐఐఎస్ఆర్ లు, మూడు ఎస్పీఏలు, 25 ట్రిపుల్ ఐటీలు, కేంద్ర నిధులతో నడిచే నాలుగు జేఎన్టీయూల్లో చేపడతారు. ఆ తర్వాత 2028–29లో 46 సెంట్రల్ యూనివర్సిటీలు ,నాలుగు డీమ్డ్–టు–బి విశ్వవిద్యాలయాలకు వీటిని విస్తరిస్తారు. డ్రగ్స్ తాత్కాలిక ఉత్తేజాన్ని ఇవ్వొచ్చు కానీ?అవి జీవితం మొత్తాన్నీ నాశనం చేస్తాయని ప్రధాని మోడీ యువతను హెచ్చరించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ఈ మేరకు ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు.కాబట్టి ఎవరి పిల్లల గురించి వారే మొదట జాగ్రత్తలు తీసుకోవాలి. స్కూళ్లు, కాలేజీల నుంచి టైంకి ఇంటికొస్తున్నారా.. లేదా..? బ్యాగుల్లో ఏం తీసుకెళ్తున్నారు..? ఎలాంటి స్నేహితులతో తిరుగుతున్నారు..? లాంటి కనీస జాగ్రత్తలు పాటించటం అత్యవసరమని నిపుణులతో పాటు ప్రభుత్వాలు కూడా సూచిస్తున్నాయి. ఎందుకంటే ప్రతి ఇల్లు డ్రగ్స్ రహితం కావాలనే సంకల్పం తీసుకుంటే.. ఆటోమేటిగ్గా హైదరాబాద్, తెలుగు రాష్ట్రాలు కూడా డ్రగ్స్ రహితం కావడం పెద్ద కష్టం కాదు. చివరిగా దేశం కూడా డ్రగ్స్ నుంచి విముక్తం అవుతుంది.

# తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళుతున్నాం రేవంత్ రెడ్డి






**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**ఆనాడు నేను పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేస్తే కూకట్ పల్లి ప్రజలు నన్ను ఆశీర్వదించి గల్లీ నుంచి ఢిల్లీకి పంపారు.

ప్రతిపక్షంలో ఉండగా గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో మీరు ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేకపోయా

కానీ ఇప్పుడు కూకట్ పల్లిని అభివృద్ధి చేసుకునేందుకు అన్ని రకాల అధికారం ఉంది మీకు ఎలాంటి అభివృద్ధి కావాలన్నా అడిగి చేయించుకోండి

కూకట్ పల్లి నియోజకవర్గాన్ని ప్రతీక దృష్టితో అభివృద్ధి చేయాలని శ్రీధర్ బాబు ని ఆదేశిస్తున్నా

పదేళ్ల వారి పరిపాలన రెండేళ్ల మా పాలనను బేరీజు వేసుకోండి

తెలంగాణలో 3 కోట్ల 28 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నాం

ప్రతీ పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం

రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం

ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఇందిరమ్మ చీరలను సారెగా అందించాం

ఆర్టీసీలో ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం

స్వయం సహాయక సంఘాలకు రూ.65 వేల కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు అందించాం

కడుపులో విషం పెట్టుకుని ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి ప్రభుత్వంపైకి ఉసిగొల్పినా వెనక్కి తగ్గలేదు

ఆడ బిడ్డలను బస్సులకు యజమానులను చేశాం

పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాం

స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను విక్రయించుకునేందుకు శిల్పారామంలో స్టాళ్లను ఇచ్చాం

ఒకవైపు గత ప్రభుత్వం చేసిన అప్పులను చెల్లించుకుంటూనే.. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం

డబ్బా ఇండ్లు వద్దు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామన్న వాళ్లు మీలో ఒక్కరికైనా ఇల్లు ఇచ్చారా?

పట్టణంలో పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని మా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కు శ్రీకారం చుట్టింది

మొదటి విడతలో లక్ష ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది

మీ సొంతింటి కలను నిజం చేసేందుకు మీ సోదరుడిగా మీకు అండగా ఉంటా

22 ఏ విషయంలో మీ సొంత భూములు కోల్పోకుండా చూసే బాధ్యత మాది

ఈ విషయంలో మీకు ఆందోళన అవసరం లేదు..

సోషల్ మీడియాలో కొందరు చేసే అబద్ధపు ప్రచారాన్ని నమ్మొద్దు

పదేళ్ల వారి పాలను.. రెండేళ్ల మీ తమ్ముడి పాలనను బేరీజు వేసుకోండి

నాకు వయసు ఉంది... ఓపిక ఉంది.. మీకు మంచి చేయాలన్న సంకల్పం ఉంది

తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళుతున్నాం

కొంతమంది దుర్మార్గులు రాష్ట్రంలో కరువు రావాలని క్షుద్ర పూజలు చేశారు

అయినా దేవుడు మన వైపు ఉన్నాడు.. వర్షాలు కురిపించాడు

మంచి మనసుతో అభివృద్ధి చేయాలన్న మా సంకల్పానికి దేవుడి ఆశీర్వాదం ఉంది

కుటిల బుద్ధితో క్షుద్ర పూజలు చేసే వారికి అది తిరిగి వారినే అష్ట దిగ్బంధనం చేస్తుంది

మీరు అండగా ఉండండి.. అభివృద్ధి చేసి చూపిస్తా.

# బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ‘ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు’



మొదటి పేజీ తరువాయి

1.19 లక్షల మహిళలకు ప్రయోజనం

రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో కుట్టు మిషన్ విలువ రూ.12,000 కాగా, లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు.

ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

పేద, ఒంటరి మహిళలకు ప్రాధాన్యత

కుట్టు వృత్తిపై ఆసక్తి ఉన్న నిరుద్యోగ బీసీ మహిళలకు ఈ పథకం ద్వారా స్వయం ఉపాధి కల్పించడమే ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. అత్యంత పేదలు, వితంతువులు, ఒంటరి మహిళలు, నిరాశ్రయులు, అనాథలు, వికలాంగులు, అలాగే కుట్టు వృత్తిలో అనుభవం ఉన్న మహిళలకు నిబంధనల మేరకు ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు.లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. కుట్టు మిషన్ల వినియోగంపై అవసరమైన శిక్షణను కూడా తప్పనిసరి చేస్తున్నట్లు తెలిపారు.

మొదటి దశలో 1.19 లక్షల మందికి అవకాశం

కుట్టు మిషన్లు కోరుకునే మహిళల సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, మొదటి దశలో 1.19 లక్షల మంది అర్హులకు ప్రయోజనం కల్పిస్తామని మంత్రి చెప్పారు. భవిష్యత్‌లో పథకాన్ని మరింత విస్తరించి ఎక్కువ మంది బీసీ మహిళలకు ప్రయోజనం కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

మహిళల ఉపాధికి ప్రభుత్వం అండ

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సులు, ఇతర స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. అదే విధంగా ‘ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు’ పథకం ద్వారా బీసీ మహిళలకు ఇంటి నుంచే ఆదాయం పొందే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు.

బీసీ సంక్షేమ శాఖ ద్వారా ఆత్మగౌరవ భవనాలకు నిధులు కేటాయిస్తూ, వాటి నిర్మాణాలను పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. ఇటీవల బలహీన వర్గాల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి బీసీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని చెప్పారు. కులగణన అనంతరం బీసీల అభివృద్ధికి సంబంధించిన తదుపరి కార్యాచరణను ముందుకు తీసుకెళ్తామని మంత్రి పేర్కొన్నారు.

పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణకు భారీగా తరలిరావాలి

ఈనెల 14వ తేదీ సాయంత్రం 4 గంటలకు హెచ్ఎండీఏ గ్రౌండ్స్ ఎదురుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ చాంపియన్‌గా నిలుస్తోందని, మహాత్మా జ్యోతిబాపూలేను స్మరించుకుంటూ ప్రగతి భవన్‌ను “మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్” గా, సచివాలయాన్ని “డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం”’గా పేరు మార్చినట్లు తెలిపారు.

అలాగే ఈనెల 18వ తేదీన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారని మంత్రి తెలిపారు. ఈ రెండు కార్యక్రమాల్లో బీసీ ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు ఈర్లపల్లి శంకరయ్య, నవీన్ యాదవ్, కాలేరు వెంకటేష్, వివిధ కులాల కార్పొరేషన్ చైర్మన్లు, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయాదేవి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కోల్డ్ ప్రెస్ ఆయిల్ మిల్ ప్రారంభించిన ఎమ్మెల్యే

నాగర్ కర్నూల్ జిల్లాచిన్నముద్దునూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గోదాములు, 13 అగ్రి ఔట్‌లెట్లు, మినరల్ వాటర్ ప్లాంట్, కోల్డ్ ప్రెస్ ఆయిల్ మిల్ ప్రారంభం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమన్న ఎమ్మెల్యేరైతులు పంటలను నిల్వ చేసుకునేందుకు గోదాములు ఎంతో ఉపయోగకరమని వెల్లడివ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించేందుకు కోల్డ్ ప్రెస్ ఆయిల్ మిల్ దోహదపడుతుందని ప్రజలకు ఉపయోగపడేలా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు అభినందనీయమన్న ఎమ్మెల్యే చిన్నముద్దునూరు గ్రామ అభివృద్ధికి మరింత సహకారం అందిస్తామని హామీ రైతు సంక్షేమం, గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయ రంగ బలోపేతమే లక్ష్యమని స్పష్టంకార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, ఖంఅూ చైర్మన్ భాస్కర్ రెడ్డి, సర్పంచ్ రుక్సాన ఖదీర్, ఖంఅూ ఉపాధ్యక్షుడు యాదయ్య తదితరులు పాల్గొన్నారు మండల నాయకులు, సర్పంచ్, ఉపసర్పంచ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు హాజరయ్యారు

# ఖేలో ఇండియా క్రీడలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం: మంత్రి వాకిటి శ్రీహరి

## కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో తెలంగాణ ప్రతినిధుల భేటీ.



న్యూఢిల్లీ, ఆగస్టు 13, 2026: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను తెలంగాణ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గురువారం న్యూఢిల్లీలో కలిశారు. ఆయనతోపాటు తెలంగాణ ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె. శివసేన రెడ్డి ఉన్నారు.

తెలంగాణకు ఖేలో ఇండియా క్రీడలను కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి వాకిటి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాసిన ఆహ్వాన లేఖను కేంద్ర మంత్రి మాండవీయకు అందజేశారు. డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు 12 రోజులపాటు తెలంగాణలో ఖేలో ఇండియా క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఖేలో ఇండియా క్రీడలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసిందని మంత్రి పేర్కొన్నారు. నిర్వహణలో ఎలాంటి లోపాలు, విమర్శలకు తావులేకుండా అత్యున్నత ప్రమాణాలతో పోటీలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమయం తీసుకుని, ఖేలో ఇండియా క్రీడల ప్రారంభోత్సవానికి హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆహ్వానిస్తారని తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం నూతన క్రీడా విధానాన్ని తీసుకొచ్చి, విప్లవాత్మక నిర్ణయాలతో రాష్ట్రంలో క్రీడారంగాన్ని ముందుకు తీసుకెళ్తోందని మంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. అందరి సహకారంతో ఖేలో ఇండియా క్రీడలను విజయవంతంగా నిర్వహించి తెలంగాణ ప్రతిష్ఠను మరింత పెంచుతామని పేర్కొన్నారు.

# కాళేశ్వరం, యూనిటీ మాల్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరపాలి: కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై రఘునందన్ రావు ధ్వజం



కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై కేవలం మూడు బ్యారేజీలకు మాత్రమే పరిమితం కాకుండా, డీపీఆర్ తయారీ నుంచి ముగింపు చెల్లింపుల వరకు సీబీఐ చేత సమగ్ర విచారణ జరిపించాలని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ దర్యాప్తు కోరుతూ కేంద్రానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే లేఖ రాయాలని, తానే స్వయంగా కేంద్ర హోంమంత్రిని కలిసి విచారణ ముందుకు సాగేలా కృషి చేస్తానని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ. 202 కోట్ల నిధులు, రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూమితో చేపట్టనున్న 'యూనిటీ మాల్' ఒప్పందంలో అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపైనా విచారణ జరగాలని రఘునందన్ రావు అన్నారు. గతంలో కేటీఆర్ తప్పు చేస్తే విచారణ జరిపినప్పుడు, ఇప్పుడు కాంగ్రెస్ తప్పులపైనా దర్యాప్తు ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. 2018లో బీఆర్ఎస్ హయాంలో జరిగిన 10 ఎకరాల భూకేటాయింపుతో పాటు ప్రస్తుత యూనిటీ మాల్ ఒప్పందంపై కేంద్ర దర్యాప్తు సంస్థలు, కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు వెల్లడించారు.

హైదరాబాద్‌లో ఎకరం భూమి విలువ వందల కోట్లకు చేరిందని, ప్రజల ఆస్తులను విక్రయించే హక్కు ప్రభుత్వాలకు లేదని, అవి కేవలం కస్టోడియన్లుగా మాత్రమే ఉండాలని ఎంపీ తేల్చి చెప్పారు. రాష్ట్రంలో ప్రజల సొమ్మును దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నాయని, అవినీతిలో ఈ రెండూ ఒకే నాణేనికి ఇరువైపులా ఉన్న అన్నదమ్ముల్లా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. రింగ్ రోడ్డు, ఫార్ములా-ఈ రేస్, కాళేశ్వరం వంటి విషయాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మాట మారుస్తూ ప్రజల దృష్టిని మళ్లిస్తోందని విమర్శించిన ఆయన, ఈ దోపిడీకి ముగింపు పలకాలంటే తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావాలని పిలుపునిచ్చారు.

# హిందూ - ముస్లింలు ఇద్దరూ నాకు రెండు కళ్లలాంటి వారు' ఎ. రేవంత్ రెడ్డి






హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి "హిందూ ముస్లింల మధ్య నాకు వ్యత్యాసం లేదు. హిందూ - ముస్లింలు ఇద్దరూ నాకు రెండు కళ్లలాంటి వారు" అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమితులైన అభ్యర్థులు తెలంగాణ రైజింగ్ కోసం పనిచేయాలని పిలుపనిచ్చారు.

హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ మైనారిటీల ప్రతిభా సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. గ్రూప్ 1, 2, 3, 4 తదితర కేటగిరీల్లో జరిగిన ఉద్యోగ నియామకాల్లో ఎంపికైన, అలాగే నీట్, ఐఐటీ, ఎన్ఐటీ లాంటి జాతీయ స్థాయి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన 782 మంది మైనారిటీ అభ్యర్థులకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ , మహమ్మద్ అజారుద్దీన్ , పొంగులేటి శ్రీనివాస రెడ్డి , సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ , TGMREIS ప్రెసిడెంట్ మహమ్మద్ ఫహీముద్దీన్ ఖురేషి గారితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రజాప్రభుత్వం మైనారిటీల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. "చదువొక్కటే మన భవిష్యత్తును మార్చుతుంది. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు చదువుకోవాలి. ఆ తర్వాత నుంచి విద్యార్థులు స్కిల్స్ పై దృష్టి సారించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో స్కిల్స్ ఉంటే ఉద్యోగావకాశాలకు కొదవలేదు. స్కిల్స్ ఉన్నవారికి జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో ఎన్నో ఉద్యోగావకాశాలు ఉన్నాయి.

స్కిల్స్‌లో యువతను సిద్ధం చేయాలన్న లక్ష్యంతోనే ఐటీఐలను ఏటీసీలుగా మార్చు చేశాం. పాలిటెక్నిక్ కాలేజీలను స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తెచ్చాం. నైపుణ్యం ఉంటే భవిష్యత్తు మారుతుంది. ఎంతో కష్టపడుతున్న చిన్న చిన్న కుటుంబాల నుంచి ఎంతగానే కృషి చేసి ఈ ఉద్యోగాలు సాధించుకున్న మీ అందరికీ అభినందనలు.

మైనారిటీలకు కల్పించిన 4 శాతం రిజర్వేషన్లను తొలగించాలన్న ప్రయత్నాలు జరిగాయి. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా సాధ్యం కాలేదు. సంక్షేమ కార్యక్రమాల్లో మైనారిటీలకు ప్రాధాన్యత ఇస్తున్నామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వల్ల మైనారిటీలకే ఎక్కువగా ప్రయోజనం పొందుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో గ్రూప్ -1 తో పాటు ఉద్యోగ నియామకాలేవీ జరగలేదు. గ్రూప్ - 1 కు సంబంధించి ఒకసారి ప్రయత్నం జరిగినప్పటికీ పల్లీ బఠానీల్లా పరీక్షా పత్రాలను మార్కెట్ లో విక్రయించారు. గ్రూప్ -1, 2 లాంటి పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయాలంటే పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో అర్హత కలిగిన వారు సభ్యులుగా ఉండాలి. అనామకులను సర్వీసు కమిషన్‌లో నియమించారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌తో పాటు నిపుణులతో సమాలోచనలు జరిపి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పూర్తిగా ప్రక్షాళన చేశాం. రాష్ట్రంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలను అడ్డుకోవాలని అనేక అడ్డంకులు సృష్టించారు. మీరంతా మా కుటుంబ సభ్యులుగా భావించి హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు ఉద్దండులైన న్యాయవాదులను నియమించి పోరాటం చేసి నియామకాలను పూర్తి చేశాం" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# రామడుగు మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా యాత్ర

:రామడుగు: భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షులు మోడీ రవీందర్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా రామడుగు మండల కేంద్రంలోని అంబెద్కర్ విగ్రహం నుంచి ఛత్రపతి శివాజీ విగ్రహం వద్దకు బీజేపీ శ్రేణులు జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్ హాజరై వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా కుల మత బేధం లేకుండా జాతీయ భావాన్ని దేశ భక్తి ని పెంపొందించుకోవలని అన్నారు.ప్రతి ఒక్కరికి దేశం పట్ల సమాజం పట్ల గౌరవంగా ఉండలని వారు సూచించారు.ప్రతి ఇంటి మీద జాతీయ జెండాలను కట్టుకోవాలాని సూచించారు.దేశ భక్తి ని పెంచడమే హర్ ఘర్ తిరంగా లక్ష్యం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ మోర్చా ఉపాధ్యక్షురాలు మామిడిపెల్లి చైతన్య మండల ప్రధాన కార్యదర్శిలు పోచంపెల్లి నరేష్ గుంట అశోక్ మండల ఉపాధ్యక్షుడు మాదం శివ కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు బద్ధం లక్ష్మారెడ్డి యువ మోర్చా మండల అధ్యక్షులు దయ్యాల రాజు(ఓబీసీ)మోర్చా మండల అధ్యక్షుడు జంగిలి కరుణాకర్ సీనియర్ నాయకులు దయ్యాల వీరమల్లు తడగొండ అశోక్ గోపు అనంత రెడ్డి యువ మోర్చా నాయకులు బండారి శ్రీనివాస్ ఎడవెల్లి లక్ష్మణ్ బీర్ల వినోద్ శ్రీకాంత్ మండల కార్యవర్గ సభ్యులు వేముల రమేష్ పురంశెట్టి మల్లేశం వంచ మనోజ్ బూత్ అధ్యక్షులు కదారి శ్రీనివాస్ దైవల తిరుపతి బుర్ర శ్రీధర్ ఎగుర్ల ఎల్లయ్య పెంచాల అంజి వెంకటేశం రామకృష్ణ లంక నర్సింగమ్ తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణ, సర్వే ప్రక్రియపై అపోహలు వీడాలి -- నూతన మ్యాప్ ఆధారంగానే సర్వేలు:జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 13, 2026-ఆదిలాబాద్ భూసేకరణ, సర్వే ప్రక్రియపై ప్రజల్లో ఎలాంటి అపోహలు, సందేహాలకు తావులేకుండా అన్ని శాఖల అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (AAI), రక్షణ శాఖ సంయుక్తంగా ఆమోదించిన నూతన మ్యాప్ ఆధారంగానే సర్వేలు, భూసేకరణ, అభివృద్ధి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.

గురువారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, గతంలో రూపొందించిన మ్యాప్ కేవలం టేబుల్‌టాప్ వ్యాయామం ద్వారా సిద్ధమైందేనని, ఆ ప్రక్రియలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారుల ప్రత్యక్ష భాగస్వామ్యం లేనందున ప్రస్తుతం దానికి పరిపాలనా పరంగా ఎలాంటి ప్రాధాన్యం లేదన్నారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ, రక్షణ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పలుమార్లు పరిశీలించి ఆమోదించిన నూతన మ్యాప్‌కే అధికారిక గుర్తింపు ఉందని తెలిపారు.

ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం కేటాయించాల్సిన 2,009 ఎకరాల భూసేకరణను రాబోయే మూడు నెలల్లో పూర్తి చేసి భూమిని అప్పగించేలా అధికారులు కార్యాచరణ వేగవంతం చేయాలని ఆదేశించారు.రోడ్ల మళ్లింపు, విద్యుత్ లైన్ల తొలగింపు, సాగునీటి కాలువల మార్పు వంటి పనులకు సంబంధించి మున్సిపల్, ట్రాన్స్‌కో, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖలకు అవసరమైన పరిపాలనా అనుమతులు జారీ అయ్యాయని తెలిపారు. ప్రతి శాఖ నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేసేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రజలు, ప్రజాప్రతినిధుల సందేహాలను అధికారులు పూర్తి వివరాలు తెలియజేసి అపోహలను నివృత్తి చేయాలని, అన్ని శాఖలు ఒకే విధమైన స్పష్టమైన సమాచారాన్ని అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, రాజేశ్వర్,ఆర్డీఓ జగదీశ్వర్ రావు, డిప్యూటీ కలెక్టర్ వంశీకృష్ణ, రెవెన్యూ, సర్వే, ఆర్అండ్‌బీ, మున్సిపాలిటీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విజయసాయపార్టీ లీకుల వ్యూహం ఏమిటీ

నెల్లూరు, ఆగస్టు 13, వైఎస్సార్‌సీపీలో ఒకప్పుడు నంబర్–2గా చక్రం తిప్పి, ఆ తర్వాత రాజకీయ సన్యాసం ప్రకటించిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి మళ్లీ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారారు. వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయిన అనంతరం తన పదవికి, పార్టీకి రాజీనామా చేసి వ్యవసాయం చేసుకుంటాను అని చెప్పిన ఆయన, ఇప్పుడు సడన్‌గా కొత్త పొలిటికల్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన తొలినాళ్లలో విజయసాయిరెడ్డి బీజేపీ గూటికి చేరుతారని విస్తృత ప్రచారం జరిగింది. ఢిల్లీ స్థాయిలో ఆయనకున్న పరిచయాలు, కేంద్ర పెద్దలతో ఉన్న సంబంధాల దృష్ట్యా కమలం తీర్థం పుచ్చుకుంటారని భావించారు. అయితే, ఏపీలో టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి అధికారంలో ఉంది. విజయసాయిరెడ్డిని పార్టీలోకి తీసుకుంటే టీడీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందనే భావనతో పాటు, కూటమి ధర్మాన్ని పాటించేందుకు కేంద్ర బీజేపీ నాయకత్వం ఆయన చేరికపై సుముఖత చూపలేదని సమాచారం. బీజేపీ తలకదనం లేకపోవడంతో, అలాగే ఇతర జాతీయ పార్టీల వైపు వెళ్లే అవకాశం లేకపోవడంతో ఆయనకు సొంత బాట పట్టడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేకుండా పోయింది.కొన్ని రోజులుగా ఆయన తిరిగి పాతగూటికి వెళ్తారని ప్రచారం జరుగుతున్నా అది దాదాపు అసాధ్యమని అంటున్నారు. వైఎస్సార్‌సీపీలో అంతర్గతంగా పెరిగిన విభేదాలు, కోటరీతో విభేదించి బయటకు రావడం, ఆ తర్వాత ఆ పార్టీ అధినాయకత్వాన్ని ఉద్దేశించి సోషల్ మీడియా ద్వారా విమర్శనాత్మక పోస్టులు పెట్టడం వల్ల జగన్‌తో ఆయనకు గ్యాప్ పెరిగింది. ఎన్నికల ఓటమి తర్వాత జగన్ కూడా విజయసాయిరెడ్డి వ్యాఖ్యల పట్ల అసంతృప్తిగా ఉన్నారని, ఆయనను తిరిగి చేర్చుకోవడానికి జగన్ సిద్ధంగా లేరనే అభిప్రాయం వినిపించడంతో విజయసాయిరెడ్డి పూర్తిగా వైఎస్సార్‌సీపీ అధ్యాయానికి స్వస్తి చెప్పారని భావించవచ్చుఈ పరిణామాలతో విజయసాయిరెడ్డి భారత్ జన వికాస్ పేరుతో సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు ముహూర్తం ఖరారు చేసుకుంటున్నట్లు లీకులు బయటకు వచ్చాయి. శ్రావణ మాసం ముగిసేలోపు పార్టీ ప్రకటన ఉండే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. మహిళలు, రైతులు, యువత, సమగ్ర రాష్ట్రాభివృద్ధే ఎజెండాగా ప్రాంతాల వారీగా సభలు నిర్వహించాలని ఆయన యోచిస్తున్నారు. అయితే ఈ పార్టీ వెనుక మరికొందరు ముఖ్యుల ఆశీస్సులు ఉన్నాయా? లేదా ఇతర రాజకీయ శక్తులు తెరవెనుక ఉండి నడిపిస్తున్నాయా? అనే సందేహాలు కూడా రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రం ప్రస్తుతం టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి , వైఎస్సార్‌సీపీల మధ్య ముఖాముఖి పోరుగా ఉంది. ఈ బైపోలార్ పొలిటికల్ వాతావరణంలో మూడో శక్తిగా నిలబడటం లేదా సొంత పార్టీతో ప్రభావం చూపడం అత్యంత సంక్లిష్టమైన అంశం. విజయసాయిరెడ్డికి మాస్ క్యాడర్ ఆధారిత ప్రజాదరణ లేకపోవడం, కేవలం ఆర్గనైజర్ , స్ట్రాటజిస్ట్‌గా మాత్రమే గుర్తింపు ఉండటం ప్రధాన పరిమితి. ఒకవేళ పార్టీ పెట్టినా, ఆయన సాధించే ఓటింగ్ శాతం కూటమికి లాభం చేకూరుస్తుందా లేక వైఎస్సార్‌సీపీ ఓట్ బ్యాంక్‌కే గండికొడుతుందా అనేది వేచి చూడాలి. భారీ ఆర్థిక వనరులు, బలమైన క్యాడర్ లేనిదే కొత్త పార్టీ నిలదొక్కుకోవడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# కూటమి సర్కార్‌కు 'కౌన్సిల్' గండం..!

విజయవాడ, ఆగస్టు 13, తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వైసీపీ శాసనసభాపక్ష సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో రాబోయే ఏపీ శాసనసభ, మండలి వర్షాకాల సమావేశాలపై పార్టీ శ్రేణులకు జగన్ దిశా నిర్దేశం చేశారు. ఈ క్రమంలో ఏపీ శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ అభ్యర్థిగా గుంటూరు జిల్లాకు చెందిన పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావును వైఎస్ జగన్ అధికారికంగా ఎంపిక చేశారు.అయితే, గత సమావేశాల మాదిరిగానే తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వనందుకు నిరసనగా ఈసారి కూడా అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాలని వైసీపీ ఎమ్మెల్యేలు నిర్ణయించుకున్నారు. కానీ, తమకు పూర్తి మెజారిటీ ఉన్న శాసనమండలి (కౌన్సిల్) సమావేశాలకు మాత్రం వైసీపీ ఎమ్మెల్సీలు అందరూ విధిగా హాజరుకావాలని పార్టీ అధిష్టానం స్పష్టం చేసింది. అసెంబ్లీకి దూరంగా ఉన్నప్పటికీ, శాసనమండలి వేదికగా అధికార చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు వైసీపీ పక్కా వ్యూహాలు రచిస్తోంది.పోయినసారి తిరుమల శ్రీవారి లడ్డు కల్తీ వ్యవహారంపై పెద్ద ఎత్తున రచ్చ చేసిన వైసీపీ, ఈసారి నిరుద్యోగుల సమస్యలను ప్రధాన అస్త్రంగా మార్చుకోనుంది. ముఖ్యంగా రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియలో జరిగినట్లు చెప్తున్న అవకతవకలు, మరియు అభ్యర్థుల ఆందోళనలను మండలిలో బలంగా వినిపించాలని వైసీపీ భావిస్తోంది. మెగా డీఎస్సీ అభ్యర్థులకు జరిగిన అన్యాయంపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీయడం ద్వారా నిరుద్యోగుల పక్షాన నిలబడాలని వైఎస్ జగన్ తన ఎమ్మెల్సీలకు సూచించారు.ఆగస్టు 17 నుంచి ఏపీ శాసనసభ, మండలి సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రాజకీయ వాతావరణం అప్పుడే వేడెక్కింది. కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో సులభంగా బిల్లులను ఆమోదింపజేసుకున్నప్పటికీ, శాసనమండలిలో మాత్రం వైసీపీకి మెజారిటీ ఉండటంతో ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లులను అడ్డుకునే అవకాశం ఉంది. ఒకవైపు గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్–1 అక్రమాలపై సిట్ తుది నివేదికతో కూటమి సర్కార్ వైఎస్సార్సీపీని కట్టడి చేయాలని చూస్తుండగా, మరోవైపు కల్తీ లడ్డు, డీఎస్సీ వ్యవహారాలను అడ్డం పెట్టుకుని శాసనమండలి వేదికగా ప్రభుత్వాన్ని ముప్పతిప్పలు పెట్టేందుకు వైసీపీ సిద్ధమవుతోంది. దీంతో ఈ వర్షాకాల సమావేశాలలో మండలి వేదికగా ఇరుపక్షాల మధ్య తీవ్ర స్థాయిలోనే రాజకీయం నడవనుందని స్పష్టమవుతోంది.

# మారనున్న కేబీఆర్ పార్కు రూపు రేఖలు

హైదరాబాద్, ఆగస్టు 13 హైదరాబాద్ ప్రజలకు మరో సూపర్ న్యూస్. నగరంలో ప్రముఖ పార్క్‌గా ప్రసిద్ధి పొందిన కేబీఆర్ పార్క్ వద్ద రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. ఈ పార్క్ వద్ద విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. దీనిని తగ్గించేందుకు ప్రభుత్వం సరికొత్త ఆలోచన చేసింది. పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణానికి ముందడుగు వేసింది. మొత్తం 14 నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఏడు ప్రధాన కూడళ్ల వద్ద ఈ నిర్మాణాలు జరగనున్నాయి. మొన్నటివరకు కోర్టు కేసులు, భూసేకరణ ప్రక్రియ వల్ల కొంత జాప్యం జరగగా.. ఇప్పుడు అవన్నీ తొలగిపోయాయి. దీంతో అధికారులు ప్రక్రియను మరింత వేగవంతం చేశారు. రెండేళ్లల్లో పనులన్నీ పూర్తి చేయాలనే లక్ష్యం నిర్దేశించుకున్నారు. వాహనదారులకు ఇబ్బంది కలగకుండా పనులు త్వరతగతిన పూర్తి చేయాలని భావిస్తున్నారు.ఈ ప్రాజెక్టులో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36 నుంచి కేబీఆర్ పార్క్ రోడ్డు మధ్య నాలుగు లైన్ల ఫ్లైఓవర్ ఉంటుంది. ఇక పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపుకు 3 లైన్ల ఫ్లైఓవర్ నిర్మిస్తారు. ఇక మహారాజా అగ్రసేన జంక్షన్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10 వైపు 2 లైన్ల ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. ఇక ఫిల్మ్ నగర్–బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 మధ్య 2 లైన్లతో కూడిన ఫ్లైఓవర్ ప్రతిపాదించారు. అలాగే జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్–జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45 మధ్య 2 లైన్ల ఫ్లైఓవర్ ఉంటుంది. ఇక వీటితో పాటు మొత్తం 6 అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. ఫిల్మ్ నగర్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపు 2 లైన్ల అండర్ పాస్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి నుంచి ఫిల్మ్ నగర్ వైపు ఒక అండర్ పాస్, ఎల్వీ ప్రసాద్ నుంచి పంజాగుట్ట వైపు 3 లైన్ల అండర్ పాస్, రోడ్డు నెంబర్ 45 నుంచి కేబీఆర్ పార్క్ ఎంట్రన్స్ వరకు ఒక అండర్ పాస్ ఉంటుంది.దాదాపు ఈ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి రూ.1090 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. వీటిల్లో నిర్మాణ పనుల కోసం రూ.699.75 కోట్లు ఖర్చు కానుండగా.. భూసేకరణ ప్రక్రియ కోసం రూ.390 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేస్తున్నారు. ఉక్కు వంతెనల నిర్మాణం వల్ల భూసేకరణ ఖర్చు తగ్గుతుందని, తక్కువ స్థలంలోనే పనులు చేపట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే కేబీఆర్ పార్క్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ తగ్గుతుంది. సిగ్నల్ ఫ్రీ జర్నీ వాహనదారులకు లభించనుంది. హైటెక్ సిటీ, ఫిల్మ్ నగర్ వె?పు వెళ్లేవారు వేగవంతంగా చేసుకోవచ్చు.

# డీలిమిటేషన్ కు తమిళనాడు క్లియర్

చెన్నై, ఆగస్టు 13, (న్యూస్ పల్స్) కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై తమిళనాడు శాసనసభ అత్యంత ప్రాధాన్యత కలిగిన తీర్మానాన్ని ఆమోదించింది. జనాభా ప్రాతిపదికన మాత్రమే స్థానాల సంఖ్యను పెంచితే దక్షిణ భారత రాష్ట్రాల ప్రాతినిధ్యం తీవ్రంగా దెబ్బతింటుందనే ఆందోళనలు ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం మూడు స్పష్టమైన డిమాండ్లను సభ ముందుకు తెచ్చి ఏకగ్రీవంగా ఆమోదింపజేసింది.తీర్మానంలో పొందుపరిచిన ప్రధాన ప్రతిపాదనల ప్రకారం? ప్రస్తుతం అమల్లో ఉన్న 1971 జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాల కేటాయింపు నిష్పత్తిని యథాతథంగా కొనసాగించాలి. ఒకవేళ అనివార్య కారణాల వల్ల స్థానాల సంఖ్యను పెంచాల్సి వస్తే, ఆ పెంపును కూడా 1971 నాటి జనాభా నిష్పత్తి ప్రకారమే చేపట్టాలి. జనాభా నియంత్రణ , సామాజిక–ఆర్థిక అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేసినందుకు తమిళనాడుతో పాటు ఇతర దక్షిణ భారత రాష్ట్రాలను శిక్షించేలా పార్లమెంటరీ స్థానాల సంఖ్యను తగ్గించకూడదనేది మరో కీలక డిమాండ్.అంటే, మూడింటిలో ఏ డిమాండ్ చూసినా.. పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రస్తుత ప్రాతినిధ్య శాతాన్ని భవిష్యత్తు పునర్విభజనలోనూ ఖచ్చితంగా కాపాడాలనేదే తమిళనాడు ప్రభుత్వ స్పష్టమైన వైఖరి. ప్రస్తుతం ఉన్న స్థానాల నిష్పత్తిని యథాతథంగా కొనసాగించడం లేదా లోక్‌సభ స్థానాలు పెరిగినా.. ఇప్పుడు పార్లమెంట్‌లో ఆయా రాష్ట్రాలకు ఎంత శాతంలో ప్రాతినిధ్యం ఉందో అదే శాతాన్ని కొనసాగించేలా పెంపు నిర్ణయించాలని స్పష్టం చేస్తోంది.కేంద్ర ప్రభుత్వం కూడా భవిష్యత్తులో స్థానాల పెంపు ఏ విధంగా ఉన్నప్పటికీ దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గకుండా సమతుల్యత పాటిస్తామని చెబుతోంది. అందుకే ఈ తీర్మానం ప్రాధాన్యత సంతరించుకుంది. రాబోయే డెలిమిటేషన్ ప్రక్రియలో జనాభా నియంత్రణ సాధించిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగబద్ధమైన హామీలు, రక్షణలు కల్పించాలని తమిళనాడు అసెంబ్లీ ద్వారా కేంద్రానికి గట్టి సందేశం పంపారు

# మిత్రపక్షాల మధ్య డిజిటల్ వార్

విజయవాడ, ఆగస్టు 13, ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి తమ సోషల్ మీడియా శ్రేణులను అప్రమత్తం చేస్తూ ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. కొద్దిరోజులుగా సోషల్ మీడియా వేదికగా టీడీపీ, జనసేన సైనికుల మధ్య సాగుతున్న పరస్పర విమర్శలు, వ్యక్తిగత దూషణలు శృతిమించి కూటమి ఐక్యతకే సవాలుగా మారిన తరుణంలో నాయకత్వం ఈ దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. గొడ్డలి పార్టీ కుట్రపూరితంగా సృష్టించిన నకిలీ ఖాతాల వల్ల ఈ అంతర్గత కలహాలు నడుస్తున్నాయని, ఆ ట్రాప్‌లో పడ వద్దని కూటమి సోషల్ మీడియా కోఆర్డినేషన్ కమిటీ స్పష్టమైన ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. కొన్ని వారాలుగా సోషల్ మీడియాను గమనిస్తే.. పశ్చిమ ఏపీలోని అధికార సమన్వయం నుంచి మొదలుకొని, సినిమాలు, ఐకాన్స్, రాజకీయ ప్రాధాన్యతల వరకు టీడీపీ–జనసేన క్యాడర్ మధ్య ఘాటైన సైబర్ యుద్ధమే సాగుతోంది. సినిమాల నుంచి సీనియర్ ఎన్టీఆర్ ఆహారపు అలవాట్ల వరకూ తీవ్రస్థాయిలో ఎదురుదాడి చేసుకోవడం నిత్యకృత్యమైంది. గ్రౌండ్ లెవల్‌లో నాయకుల మధ్య సఖ్యత ఉన్నప్పటికీ, సోషల్ మీడియా డిజిటల్ స్పేస్‌లో చోటుచేసుకుంటున్న ఈ తీవ్ర స్వభావపు విమర్శలు అసలైన కార్యకర్తల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, ప్రత్యర్థులకు బలమైన రాజకీయ ఆయుధాన్ని అందించాయి.ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని విపక్ష వైసీపీ సైబర్ వింగ్ అత్యంత వ్యూహాత్మకంగా సూడో అకౌంట్స్ నడుపుతోందని కూటమి సంయుక్త ప్రకటన ఎండగట్టింది. ఒక టీడీపీ అభిమానిలా ప్రొఫైల్ రూపొందించి పవన్ కల్యాణ్‌ను హేళన చేయడం, అలాగే జనసేన సైనికుడి ముసుగులో చంద్రబాబు లేదా లోకేష్‌లను వ్యక్తిగతంగా విమర్శించడం ద్వారా ఇరు వర్గాల అసలైన కార్యకర్తలను రెచ్చగొడుతున్న వైనాన్ని కమిటీ గుర్తించింది. ఈ డిజిటల్ ట్రాప్ వల్ల నిజమైన సైనికులు ఆవేశానికి లోనై ఒకరినొకరు కించపరుచుకుంటూ, చివరికి తమ సొంత ప్రభుత్వ విజయావకాశాలను, పథకాల ప్రచారాన్ని పక్కనబెట్టి అంతర్గత పోరులోనే శక్తిని వృధా చేసుకుంటున్నారు.రాజకీయాల్లో క్షేత్రస్థాయి ఐక్యత ఎంత ముఖ్యమో, డిజిటల్ మైండ్ స్పేస్‌లో పొత్తు ధర్మాన్ని నిలబెట్టుకోవడం కూడా అంతే కీలకం. శ్రేణుల మధ్య స్వల్ప విబేధాలు కాస్తా పార్టీల అగ్రనేతల మధ్య వైరి వర్గాలుగా రూపాంతరం చెందే ప్రమాదం ఉందని గ్రహించినందునే ఈ ఉమ్మడి ప్రకటన వెలువడింది. సంయమనం పాటించకపోతే, మిత్రపక్షాల నేతలను లక్ష్యంగా చేసుకుని విద్వేషం చిమ్మే ఏ అకౌంట్‌పైనా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేయడం మంచి పరిణామం అనుకోవచ్చు. ఆవేశాన్ని పక్కనబెట్టి, ప్రత్యర్థుల నకిలీ వ్యూహాలను తిప్పికొడుతూ ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపైనే కూటమి సోషల్ సైన్యాలు దృష్టి సారించాల్సి ఉంది.

# మహాకుంభమేళ తరహాలో గోదావరి పుష్కరాలు

రాజమండ్రి, ఆగస్టు 13, ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా తరహాలో, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, అత్యున్నత వసతులతో 2027 గోదావరి పుష్కరాలను నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం సన్నాహాలు ముమ్మరం చేసింది. దక్షిణాది మహా కుంభమేళాగా భావించే ఈ పుష్కరాలకు కోట్ల సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, గ్లోబల్ స్టాండర్డ్స్‌కు తగినట్లు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మహాక్రతువు కోసం మొత్తం అంచనా వ్యయం రూ.8,500 కోట్లుగా నిర్ధారించగా.. తొలి విడత మౌలిక వసతులు, ఘాట్ల విస్తరణ పనుల నిమిత్తం ప్రభుత్వం ఇప్పటివరకు రూ.530 కోట్లను అధికారికంగా మంజూరు చేసింది.పుష్కరాల నిర్వహణలో అత్యంత కీలకమైన శాఖలకు నిధుల కేటాయింపులను ప్రభుత్వం పక్కాగా వర్గీకరించింది. గోదావరి తీరంలో భక్తుల రద్దీని తట్టుకునేలా 238 పాత , కొత్త పుష్కర ఘాట్ల ఆధునీకరణ, మరమ్మతులు, నిర్మాణాలు చేపడుతున్న నీటిపారుదల శాఖకు అత్యధికంగా రూ.210.06 కోట్లు కేటాయించారు. పట్టణ మౌలిక వసతులు, పారిశుధ్య నిర్వహణ పనుల నిమిత్తం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.150 కోట్లు విడుదల కాగా, గోదావరి తీరమంతటా నిరంతర విద్యుత్ సరఫరా, తాత్కాలిక సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ఇంధన శాఖకు రూ.100 కోట్లు కేటాయించారు. దీంతో పాటు ఆలయాల సుందరీకరణ, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు దేవాదాయ శాఖకు రూ.60 కోట్లు, టూరిజం సేవలు, సాంస్కృతిక ప్రదర్శనల విస్తరణకు పర్యాటక, సాంస్కృతిక శాఖకు రూ.10 కోట్లు నిధులు విడుదలయ్యాయి.ఈసారి పుష్కరాలలో డిజిటల్ టెక్నాలజీ వినియోగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. లక్షలాది మంది భక్తులు ఒకేసారి వచ్చే అవకాశం ఉన్నందున క్రౌడ్ మేనేజ్‌మెంట్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సీసీటీవీ నెట్‌వర్క్, డ్రోన్ సర్వైలెన్స్, రియల్ టైమ్ కంట్రోల్ రూమ్‌లను అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. భక్తులు తాము స్నానం చేయాలనుకునే ఘాట్లు, స్లాట్ బుకింగ్, ట్రాఫిక్ రూట్ మ్యాప్స్, అందుబాటులో ఉన్న పార్కింగ్ స్థలాలు, అత్యవసర వైద్య సేవల సమాచారాన్ని సులువుగా తెలుసుకునేలా ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌ను, క్యూఆర్ కోడ్ నేవిగేషన్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.నది తీరం పొడవునా పారిశుధ్యం, భద్రత , పర్యావరణ పరిరక్షణ విషయాలలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. నది నీరు కలుషితం కాకుండా ప్రత్యేక ఫిల్ట్రేషన్ గ్రిడ్లను ఏర్పాటు చేయడమే కాక, ప్లాస్టిక్ రహిత పుష్కరాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రతి ఘాట్ వద్ద 24 గంటలు అందుబాటులో ఉండేలా మొబైల్ మెడికల్ టీమ్‌లు, అంబులెన్సులు, పారిశుధ్య సిబ్బంది , స్విమ్మింగ్ నిపుణులను అందుబాటులో ఉంచనున్నారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు వేగంగా పనిచేస్తాయి. రాజమండ్రి, కోవూరు, నరసాపురం, భద్రాచలం పరిసర ప్రాంతాల గోదావరి తీరాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్ది, పుష్కరాలకు వచ్చే కోట్లాది మంది భక్తులకు భక్తిపారవశ్యంతో పాటు అధునాతనమైన, సురక్షితమైన ఆధ్యాత్మిక అనుభూతిని అందించడమే లక్ష్యంగా వైభవంగా ఏర్పాట్లు వేగవంతమవుతున్నాయి.

# ఏపీలో వడివడిగా మెట్రో అడుగులు

విజయవాడ, ఆగస్టు 13, దేశంలోని చాలా నగరాలల్లో మెట్రో రైలు సేవలు అందుబాటులోకి వచ్చాయి. మెట్రో సేవలు కలిగిన రాష్ట్రాల జాబితాలోకి త్వరలో ఏపీ కూడా చేరబోతోంది. ఇతర రాష్ట్రాల్లో కేవలం ఒక ఒకటి, అరా నగరాల్లోనే మెట్రో సేవలు కొనసాగుతుంటే.. ఏపీలో ఏకంగా రెండు నగరాల్లో మెట్రో సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు ఏపీలోని విజయవాడ, విశాఖపట్నంలలో మెట్రో రైలు ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్ లకు కేంద్రం ఆమోద ముద్ర పడే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించిన ఆర్థిక మదింపును కేంద్రం ప్రారంభించింది. అంటే?ఈ ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టేనని చెప్పవచ్చు. తెలుగు నేల విభజన తర్వాత విభజిత ఏపీలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన టీడీపీ? 2015లోనే విజయవాడతో పాటుగా విశాఖలో మెట్రో సేవల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రతిపాదనలపై నాడు ఓ మోస్తరు అడుగులు పడినా? 2019లో టీడీపీ ఓడిపోవడం, వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ ప్రాజెక్టులు కాస్తా అటకెక్కేశాయి. అయితే 2024 ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో కలిసిన టీడీపీ? తిరిగి అధికారం చేజిక్కించుకుంది. అంతేకాకుండా అటు కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు, ఇటు ఏపీలో టీడీపీ నేతృత్వంలోని కూటమి సర్కారు కొలువు దీరడంతో? సీఎం నారా చంద్రబాబునాయుడు మరోమారు మెట్రో ప్రాజుక్టుల బూజు దులిపారు.విజయవాడ, విశాఖల మెట్రో రైలు ప్రాజెక్టులకు సంబంధించి డీపీఆర్ లను రూపొందించిన కూటమి సర్కారు.. వాటిని కేంద్రం పరిశీలనకు పంపింది. ఈ ప్రతిపాదనలపై దృష్టి సారించిన కేంద్రం? ఇటీవలే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక మదింపును ప్రారంభించింది. ఈ ప్రక్రియ పూర్తి కాగానే? ఈ రెండు ప్రాజెక్టులకు కేంద్రం ఆమోద ముద్ర పడనుంది. ఆ వెంటనే విజయవాడ, విశాఖల్లో మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ కూడా ప్రారంభం కానుంది. వెరసి అతి త్వరలోనే ఈ రెండు నగరాల్లో మెట్రో రైలు సేవలు అందుబాటులోకి రానున్నాయన్న మాట. రెండు నగరాల్లో మొత్తంగా 84.63 కిలో మీటర్ల మేర మెట్రో రైలు సేవలు అందుబాటులోకి వస్తాయి.ఇక విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు విషయానికి వస్తే..పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి గన్నవరం, పెనమలూరు దారా తొలి దశ మెట్రో రైలు సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు బందరు రోడ్డు, ఏలూ రోడ్డు, గన్నవరం, పెనమలూరుల్లో భూసేకరణకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. నగరంలో 38.40 కిలో మీటర్ల మేర ఏర్పాటు కానున్న మెట్రో ప్రాజెక్టుకు రూ.10,118 కోట్ల నిధులు అవసరం కానున్నాయి. బస్టాండ్ నుంచి గన్నవరం, పెనమలూరుల వరకు రెండు మార్గాల్లో మెట్రో ఏర్పాటు కానుంది. విశాఖ మెట్రో విషయానికి వస్తే? నగరంలో మూడు మార్గాల్లో 46.22 కిలో మీటర్ల మేర మెట్రో రైలు ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. డబుల్ డెక్కర్ మోడ్ లో ఈ వ్యవస్థ ఏర్పాటు కానుంది. మూడు మార్గాల్లో కలిపి 43 మెట్రో స్టేషన్లు ఉంటాయి. ఇందుకోసం రూ.11,498 కోట్ల నిధులు అవసరం కానున్నట్లుగా డీపీఆర్ లో పేర్కొన్నారు. ఇక ఈ మెట్రో స్టీల్ ప్లాంట్, గాజువాక, ఎన్ఏడీ, తాటిచెట్లపాలెం, గురుద్వారా, మద్దిలపాలెం, హనుమంతు వాకల్లో ఇంటిగ్రేటెడ్ మెట్రో స్టేషన్లు ఏర్పాటు కానుండగా? కొమ్మాది వరకూ మెట్రో ఏర్పాటు కానుంది. రెండు ప్రాజెక్టులకు కలిపి మొత్తంగా రూ.21,616 కోట్ల మేర నిధులు అవసరం కానున్నాయి. ఈ నిధుల్లో రాష్ట్రం వాటా 20 శాతం కాగా?కేంద్రం కూడా తన వంతుగా మరో 20 శాతం నిధులను అందించనుంది. ఇక మిగిలిన 60 శాతం నిధులను ఆయా ఆర్థిక సంస్థల నుంచి రుణం రూపేణా సేకరించే దిశగా డీపీఆర్ రెడీ అయ్యింది. ఏపీలో కొనసాగుతున్న పారిశ్రామిక ప్రగతి, అమరావతి అభివృద్ధిలను పరిశీలిస్తున్న పలు ప్రైవేట్ అంతర్జాతీయ సంస్థలు మెట్రో ప్రాజెక్టులో నిధులు వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నాయి. వెరసి త్వరలోనే ఏపీలో రెండు ప్రాజెక్టులు ఒకేసారి పట్టాలెక్కనున్నాయని చెప్పవచ్చు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేల రివర్స్ గేర్. గులాబీ గూటివైపు చూపులు?

హైదరాబాద్, ఆగస్టు 13 బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. అధికార పార్టీలో చేరితే నియోజకవర్గాలకు భారీగా నిధులు వస్తాయని, పెండింగ్ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించిన పలువురు ఎమ్మెల్యేలకు అనుకున్న స్థాయిలో ఫలితం కనిపించకపోవడంతో అసంతృప్తి పెరుగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో కొందరు ఎమ్మెల్యేలు తిరిగి బీఆర్ఎస్ వైపు అడుగులు వేయాలనే ఆలోచనలో ఉన్నారన్న ప్రచారం ఊపందుకుంది. ఈ క్రమంలో బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీరి తర్వాత మరికొందరు కూడా ఇదే బాట పట్టే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో సంప్రదింపులు జరుగుతున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం ఉన్నా.. దీనిపై అధికారికంగా ఎలాంటి స్పష్టత రాలేదు. కామారెడ్డి జిల్లా బీర్కూరులో కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో పోచారం శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ చర్చకు మరింత ఊతమిచ్చాయి. తాను మంత్రి పదవి కోసం, డబ్బు కోసం కాంగ్రెస్‌లో చేరలేదని, కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారానని ఆయన స్పష్టం చేశారు. అయితే తాను ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదన్న అసంతృప్తిని బహిరంగంగానే వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన సమయంలో బాన్సువాడ నియోజకవర్గంలోని పెండింగ్ సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని పోచారం గుర్తు చేశారు. కానీ ఆ హామీలు పూర్తిగా అమలు కాలేదన్న భావన ఆయన వ్యాఖ్యల్లో వ్యక్తమైంది. మంత్రులకు ఫోన్ చేసినా స్పందించడం లేదని, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా సీఎం మాటలను పట్టించుకోవడం లేదని ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లోని అంతర్గత పరిస్థితులపై చర్చకు దారితీశాయి. సీఎం స్వయంగా చెప్పినా పనులు జరగడం లేదని, ముఖ్యమంత్రి కార్యాలయంలో కీలకంగా వ్యవహరించే వేం నరేందర్‌రెడ్డికి పలుమార్లు ఫోన్ చేసినా స్పందన లేదని పోచారం పేర్కొన్నట్లు సమాచారం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులుగా గెలిచి, ఆ తర్వాత అధికార కాంగ్రెస్ కండువా కప్పుకున్న పదిమంది ఎమ్మెల్యేల పరిస్థితి ప్రస్తుతం ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా తయారైంది. ప్రధానంగా బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఇటీవల కామారెడ్డి జిల్లా బీర్కూరు ఆత్మీయ సమావేశంలో చేసిన తీవ్ర వ్యాఖ్యలు కాంగ్రెస్ అంతర్గత కలహాలను బహిర్గతం చేశాయి. “నేను మంత్రి పదవి కోసమో, నిధుల కోసమో పార్టీ మారలేదు.. కేవలం బాన్సువాడ అభివృద్ధి కోసమే వచ్చా. కానీ, ఆరు నెలల్లో పెండింగ్ పనులు పూర్తి చేస్తానన్న సీఎం రేవంత్ రెడ్డి హామీలు అమలు కావడం లేదు” అని ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చివరికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి కూడా ఫోన్లు ఎత్తడం లేదని ఆయన చేసిన ఆరోపణలు ప్రభుత్వంలో ఫిరాయింపుదారులకు దక్కుతున్న ప్రాధాన్యతను స్పష్టం చేస్తున్నాయి. పోచారం శ్రీనివాసరెడ్డి మాత్రమే కాదు, పార్టీ మారిన ఇతర ఎమ్మెల్యేల పరిస్థితి కూడా ఇలాగే ఉందన్న చర్చ జరుగుతోంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరినప్పటికీ, ఇటీవల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వాన్ని, గత పాలనను ప్రశంసిస్తూ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికర చర్చకు దారితీశాయి. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవలి మున్సిపల్ ఎన్నికల్లో ఆయన సోదరుడు బీఆర్ఎస్ తరఫున ప్రచారం చేసి మంచి ఫలితాలు సాధించడం, గూడెం ‘ఘర్ వాపసీ’కి సంకేతంగా భావిస్తున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిలు సైతం తమ నియోజకవర్గాల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేక తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల తిరుగుబాటు సంకేతాలతో కాంగ్రెస్ నాయకత్వం అప్రమత్తమైంది. కాంగ్రెస్ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ ఈ వ్యవహారంపై దృష్టి సారించారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్యేలకు విజ్ఞప్తి చేశారు. అయితే, ఒకవైపు పాత కాంగ్రెస్ నాయకుల నుంచి వస్తున్న తీవ్ర వ్యతిరేకత, మరోవైపు నిధుల లేమితో ఫిరాయింపు ఎమ్మెల్యేలు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. ఈ క్రమంలోనే కొందరు కీలక ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లతో సంప్రదింపులు జరుపుతున్నారనే ప్రచారం జోరందుకుంది. అధికార పార్టీ కండువా కప్పుకున్న వేళ కనిపించిన ఉత్సాహం ఇప్పుడు ఆవిరైపోయింది. సొంత నియోజకవర్గాల్లో ప్రజలకు ముఖం చూపించలేక ఈ ఎమ్మెల్యేలు సతమతమవుతున్నారు.

### అడకత్తెరలో రెబల్ ఎమ్మెల్యేలు

2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. అయితే పార్టీ మారిన తర్వాత కూడా కాంగ్రెస్‌లో వారికి పూర్తి స్థాయి రాజకీయ స్థానం దక్కలేదన్న అసంతృప్తి ఉందని వారి అనుచర వర్గాలు చెబుతున్నాయి. నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని స్థానిక నేతలు, అనుచరుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. అధికార పార్టీలోకి వెళ్లిన తర్వాత నిధులు, అభివృద్ధి పనులు వేగంగా వస్తాయని భావించినా.. చాలా చోట్ల పనులు ముందుకు కదలకపోవడం ఎమ్మెల్యేలకు ఇబ్బందిగా మారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కొంతకాలంగా కాంగ్రెస్‌కు దూరంగా ఉంటున్నట్లు కనిపిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఆయన సోదరుడు బీఆర్ఎస్‌లో చేరడం, ఆ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా పనిచేయడం రాజకీయంగా చర్చకు దారితీసింది. పటాన్‌చెరు పరిధిలో బీఆర్ఎస్ మెరుగైన ఫలితాలు సాధించడంతో గూడెం రాజకీయ వైఖరిపై మరింత ఆసక్తి ఏర్పడిందిజగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కూడా నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఒత్తిడి ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కీలక రోడ్డు పనులు పార్టీ మారి రెండేళ్లు గడిచినా ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడం ఆయనకు ఇబ్బందిగా మారిందని స్థానిక వర్గాలు చెబుతున్నాయి. గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పరిస్థితి కూడా ఇలాగే ఉంది. గుర్రం లిఫ్ట్ పథకం పనులు చేపట్టడంతో పాటు పలు రిజర్వాయర్ల సామర్థ్యాన్ని పెంచితే నియోజకవర్గానికి ప్రయోజనం కలుగుతుందని ఆయన భావిస్తున్నారు. అయితే ఈ పనుల్లో జాప్యం జరుగుతుండటం ఆయనను కూడా అసంతృప్తికి గురిచేస్తున్నట్లు సమాచారం. ఫిరాయింపు ఎమ్మెల్యేల నుంచి వరుసగా అసంతృప్తి వ్యక్తమవుతుండటంతో కాంగ్రెస్ నాయకత్వం అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా ఈ అంశంపై ఆరాతీసినట్టు సమాచారం. పోచారం వ్యాఖ్యలపై పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ స్పందిస్తూ.. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న వనరులతో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. అయితే ఎమ్మెల్యేల స్థాయిలో పరిస్థితులు అంత సాఫీగా లేవన్న సంకేతాలు మాత్రం కనిపిస్తున్నాయి. పార్టీ మారిన సమయంలో ఉన్న రాజకీయ ఉత్సాహం తగ్గిపోవడం, స్థానిక కాంగ్రెస్ నాయకత్వంతో సమన్వయం కుదరకపోవడం, అభివృద్ధి పనులకు నిధులు అందకపోవడం, తమ రాజకీయ భవిష్యత్తుపై స్పష్టత లేకపోవడం వంటి అంశాలు వారిని ఇబ్బంది పెడుతున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలలో కొందరు ఇప్పుడు తమ నిర్ణయాన్ని పునఃపరిశీలిస్తున్నారన్న ప్రచారం ఆసక్తిని పెంచుతోంది. అధికార పార్టీలో చేరిన సమయంలో నియోజకవర్గ అభివృద్ధి, రాజకీయ భవిష్యత్తు దృష్ట్యా తీసుకున్న నిర్ణయం ఆశించిన ఫలితాలు ఇవ్వలేదన్న భావన కొందరిలో బలపడుతున్నట్లు సమాచారం. పోచారం బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయడం, గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌కు దూరంగా కనిపించడం, దానం నాగేందర్ ఇటీవల బీఆరెస్ నాయకత్వాన్ని పొగడటం, సంజయ్ కుమార్, కృష్ణమోహన్‌రెడ్డి నియోజకవర్గ సమస్యలపై ఒత్తిడి ఎదుర్కొంటుండటం.. ఇవన్నీ ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్ అడుగులు ఎటు పడతాయా అన్న ఆసక్తిని పెంచుతున్నాయి. అయితే నిజంగానే వీరిలో కొందరు తిరిగి బీఆర్ఎస్‌లోకి వెళ్తారా? లేక ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకత్వం అసంతృప్తిని చల్లార్చి వారిని పార్టీలోనే కొనసాగేలా చూస్తారా? అన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కీలక ప్రశ్నగా మారింది.

## బండికి కీలక బాధ్యతలు



హైదరాబాద్, ఆగస్టు 13 తెలంగాణలో ఏలాగైనా అధికార పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా కమలం పార్టీ పావులు కదుపుతోంది. ఈ క్రమంలోనే రాబోయే అసెంబ్లీ సమరానికి పార్టీని సిద్ధం చేసేందుకు నేతృత్వంలో మార్పులు ఉంటాయా, లేక ప్రస్తుత సారథ్యాన్నే కొనసాగిస్తారా అనే అంశం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును తప్పించి, గతంలో పార్టీని పరుగులు తీటించిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు మళ్లీ రాష్ట్ర పార్టీ పగ్గాలు అప్పగిస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది.రాజకీయ వర్గాల్లో బండి సంజయ్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నప్పటికీ, బీజేపీ జాతీయ నాయకత్వం నుంచి మాత్రం నాయకత్వ మార్పుపై స్పష్టమైన సంకేతాలేవీ వెలువడలేదు. షెడ్యూల్ ప్రకారం తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు 2028లో జరగాల్సి ఉంది. ఒకవేళ కేంద్రం ప్రతిపాదిస్తున్న ‘జమిలి’ విధానం అమల్లోకి వస్తే, ఇవి 2029 మే లేదా జూన్ నాటికి మారే అవకాశం ఉంది. ఈ లెక్కన ప్రస్తుత అధ్యక్షుడు రాంచందర్ రావు పదవీకాలం ఇంకా సుమారు రెండేళ్లకు పైగా ఉంది. ఎన్నికలకు ఇంకా తగినంత సమయం ఉన్నందున, ఇప్పుడు హడావుడిగా అధ్యక్షుడిని మార్చడం వల్ల పార్టీలో నూతన అసంతృప్తులు, సమన్వయ లోపాలు తలెత్తే ప్రమాదం ఉందని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది.రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులో కేవలం బండి సంజయ్ మాత్రమే కాకుండా మరికొందరు అగ్రనేతలు కూడా ఉన్నారు. తెలంగాణలో బీజేపీని దూకుడుగా ముందుకు తీసుకెళ్లిన అనుభవం బండి సంజయ్ కి ఉంది. కార్యకర్తలలో ఉన్న విపరీతమైన క్రేజ్, అధికార పార్టీకి గట్టి పోటీ ఇవ్వగలరనే నమ్మకం ఆయనకు సానుకూల అంశాలు. ఇక ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, రఘునందన్ రావు కూడా పార్టీ అధ్యక్ష పీఠం ఆశిస్తున్నారు. క్షేత్రస్థాయిలో మంచి పట్టున్న ఈ సీనియర్ ఎంపీలు కూడా అధ్యక్ష బాధ్యతల కోసం జాతీయ నాయకత్వంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.అయితే నూతన అధ్యక్షుడిని నియమిస్తే, ఆయన రాష్ట్రవ్యాప్తంగా పార్టీపై పూర్తి పట్టు సాధించడానికి కొంత సమయం పడుతుంది. ఈ విరామం ఎన్నికల సమయానికి పార్టీకి ప్రతికూలంగా మారవచ్చని కొందరు విశ్లేషిస్తున్నారు. అందుకే అధ్యక్షుడిని మార్చడం కంటే, రాంచందర్ రావునే పదవిలో కొనసాగిస్తూనే.. రేసులో ఉన్న ఇతర కీలక నేతలకు వివిధ కీలక బాధ్యతలు అప్పగించాలనే ఆలోచనలో హైకమాండ్ ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా నియోజకవర్గాల వారీగా పార్టీని బలోపేతం చేయడం, బలమైన సామాజిక వర్గాలను బీజేపీ వైపు తిప్పుకోవడం, నాయకుల మధ్య సమన్వయాన్ని పెంచడంపైనే పార్టీ దృష్టి సారిస్తోంది.మొత్తానికి, బండి సంజయ్ లేదా ఇతర నేతల పేర్లు ఎంతగా ప్రచారంలో ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి రాంచందర్ రావు నేతృత్వంలోనే కమలనాథులు ముందుకు సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ‘జమిలి’ నిర్ణయం, మారే రాజకీయ సమీకరణాలను బట్టి చివరి నిమిషంలో హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి!

## పూలే విగ్రహాల ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే దానం

హైదరాబాద్ నగర నడిబొడ్డున మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నది బడుగు, బలహీన వర్గాల చిరకాల వాంఛ అని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఈ వాంఛను ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నెరవేరుస్తున్నారని తెలిపారు. ఈ నెల 14న ఐమాక్స్ ఎదురుగా ఉన్న హెచ్ఎండీఏ పార్కులో పూలే దంపతుల కాంస్య విగ్రహాలను సీఎంబ్ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు. విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే దానం నాగేందర్ అధికారులు, పోలీసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మహిళల విద్యాభివృద్ధికి జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. వారి ఆశయాలకు అనుగుణంగా సీఎం రేవంత్రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేస్తూ తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని దానం నాగేందర్ పేర్కొన్నారు. ఈ నెల 14న జరిగే విగ్రహావిష్కరణ సభకు ప్రజలు, పూలే అభిమానులు, బడుగు బలహీన వర్గాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## మండలిలో జన్ జీ...

వరంగల్, ఆగస్టు 13 తెలంగాణ రాజకీయం ఎప్పుడూ రసవత్తరంగానే ఉంటుంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగిసినా.. ఇప్పుడు రాష్ట్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వేడి అప్పుడే మొదలైంది. సాధారణంగా ఎన్నికల సమయానికి కొన్ని నెలల ముందు హడావుడి కనిపించడం సహజం, కానీ ఈ సారి ఏకంగా ముందే ప్రధాన రాజకీయ పార్టీల తరఫున యువ నాయకులు, కొత్తతరం ఆశావాహులు క్షేత్రస్థాయిలో పావులు కదుపుతున్నారు. ముఖ్యంగా గ్రాడ్యుయేట్ స్థానాల్లో విద్యావంతులు, యువత ఓటర్లుగా ఉండటంతో సాంప్రదాయ రాజకీయ సీనియర్ల కంటే ఫైర్‌బ్రాండ్ నాయకత్వం, విద్యాధికులైన యువ నేతల వైపే పార్టీలు మరియు ఓటర్లు మొగ్గు చూపే ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. తెలంగాణలోని ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలు రాబోయే కాలంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజక వర్గానికి ప్రస్తుతం బీఆర్ఎస్ నేత సురభి వాణీదేవి ప్రాతిపదికన ఉన్న ఈ సీటు గడువు 2027 మార్చితో ముగుస్తుంది. రాజధాని నగరం, ఐటీ కారిడార్ విస్తరించి ఉన్న ప్రాంతం కావడంతో ఇక్కడ గెలుపు పార్టీల ప్రతిష్టకు ప్రతీకగా మారింది. వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి గతంలో పల్లా రాజేశ్వర్ రెడ్డి విజయం సాధించారు. కానీ ఆయన ఎమ్మెల్యేగా రాజీనామా చేశారు. ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిదగా తీన్మార్ మల్లన్న విజయం సాధించారు. ఆయన ను కాంగ్రెస్ సస్పెండ్ చేసింది. ఈసారి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోటీల్లో పాత తరం నేతల కంటే యువత, సోషల్ మీడియా ప్రభావం ఉన్న నాయకులే ప్రముఖంగా వినిపిస్తున్నారు. టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్, అధికార ప్రతినిధిగా కాంగ్రెస్ వైఖరిని గట్టిగా వినిపిస్తున్న సామ రామ్మోహన్ రెడ్డి ఈసారి కాంగ్రెస్ తరఫున గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ రేసులో బలమైన అభ్యర్థిగా ప్రచారంలో ఉన్నారు. విద్యార్థి నాయకుడిగా ప్రస్థానం ప్రారంభించి, గడిచిన కొన్నేళ్లుగా టీవీ డిబేట్లు, క్షేత్రస్థాయి ఉద్యమాల ద్వారా యువతలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారాయన. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ లేదా మెదక్ ఉమ్మడి జిల్లాల పరిధి నుంచి ఆయన పోటీ చేసే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. విద్యాధికుడైన రాకేష్ రెడ్డి గత వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపఎన్నికలో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి హోరాహోరీ పోరాటం ఇచ్చారు. ఉపఎన్నికలో స్వల్ప తేడాతో ఓడినప్పటికీ లక్షకు పైగా మొదటి ప్రాధాన్యత ఓట్లను సాధించి తన సత్తా చాటారు. రాబోయే ఎమ్మెల్సీ సమరంలో ఆయన మళ్లీ ప్రధాన పోటీదారుడిగా నిలబడేందుకు నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి పట్టభద్రుల ఎన్నికలు ఓ రకంగా పనితీరుకు పరీక్షగా మారనున్నాయి. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, గ్రూప్స్ నియామకాలపై విద్యావంతుల్లో ఉన్న అభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మలుచుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ భావిస్తోంది. అందుకే అగ్రెసివ్ కాన్ఫిడెంట్ ఉన్న యువ ముఖాలను బరిలోకి దింపే యోచనలో ఉంది. మరోవైపు, కోల్పోయిన కేడర్ విశ్వాసాన్ని నిలబెట్టుకోవడానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ యువ గ్రాడ్యుయేట్లను, విద్యాధికులను ముందు వరుసలో నిలబెడుతున్నారు. ఇక బీజేపీ తన అర్బన్ ఓట్ బ్యాంక్, హిందూత్వ కేడర్‌తో పాటు విద్యావంతుల మద్దతుతో రెండు స్థానాల్లో సత్తా చాటాలని గ్రౌండ్ వర్క్ వేగవంతం చేసింది. త్వరలో ఎన్నికల సంఘం ఓటర్ నమోదు ప్రక్రియ ప్రారంభించే అకాశం ఉంది. అప్పటి నుంచే అసలు వార్ ప్రారంభం కనుంది. రాకేష్ రెడ్డి, సామ రామ్మోహన్ రెడ్డి వంటి సోషల్ మీడియా లీడర్లు ఇప్పటికే వందలాది ఐటీ నిపుణులు, నిరుద్యోగులతో డైరెక్ట్ కనెక్ట్ సాధిస్తుండటం ఈ కొత్తతరం రాజకీయాన్ని తెలియజేస్తోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ పార్టీ గెలుపోటములను నిర్ణయించేది రెండు ప్రధాన అంశాలు. మొదటిది మొదటి, రెండో ప్రాధాన్యత ఓట్ల ప్రాసెస్ అయితే, రెండోది ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు . ఉద్యోగ ప్రకటనల అమల్లో జాప్యం జరిగితే అది అధికార పార్టీ అభ్యర్థులకు ప్రతికూలంగా మారే ముప్పు ఉంటుంది. అదే సమయంలో ప్రతిపక్షాలు కేవలం విమర్శలకే పరిమితం కాకుండా సరైన ప్రత్యామ్నాయ అజెండాను చూపిస్తే తప్ప పట్టభద్రుల ఓట్లను ఆకర్షించలేవు. ఈ సమీకరణాల మధ్య రాబోయే గ్రాడ్యుయేట్ సమరం తెలంగాణ రాజకీయాల్లో ఒక ట్రెండ్ సెట్టర్‌గా మారబోతోంది.

# బిడ్ వేసి చేతులెత్తేసిన బిల్డర్.. రూ.5 కోట్లు లాస్

హైదరాబాద్, ఆగస్టు 13 హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో సంచలనం సృష్టిస్తూ కోకాపేట ప్లాట్ నంబర్ 17లో 4.59 ఎకరాల భూమికి ఎకరాకు రూ. 136.50 కోట్ల చొప్పున బిడ్ వేసిన వజ్రా కన్‌స్ట్రక్షన్స్ చెల్లింపులు చేయలేకపోయింది. దీంతో వేలం నిబంధనల ప్రకారం హెచ్ఎమ్‌డీఏ సదరు సంస్థ చెల్లించిన రూ. 5 కోట్ల ఈఎమ్‌డీ డిపాజిట్‌ను జప్తు చేసింది. ప్రీ-లాంచ్ విక్రయాల ద్వారా నిధులు సమీకరించాలనే వ్యూహం ఫలించకపోవటంతో భూమితో పాటు డిపాజిట్‌నూ సదరు సంస్థ కోల్పోయింది. కాగా, ఈ భూమిని మళ్లీ వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన కోకాపేట నియోపొలిస్ భూముల వేలంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. వేలంలో రికార్డు స్థాయిలో భారీ బిడ్ వేసి ప్లాట్‌ను దక్కించుకున్న వజ్రా కన్‌స్ట్రక్షన్స్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ నిర్ణీత గడువులోగా నిధులు చెల్లించలేక చేతులెత్తేసింది. దీంతో వేలం నిబంధనలను కఠినంగా అమలు చేస్తూ.. హెచ్ఎండీఏ సదరు నిర్మాణ సంస్థ భద్రతా డిపాజిట్‌గా చెల్లించిన రూ. 5 కోట్ల అర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఇఓఆ)ని జప్తు చేసింది.కోకాపేట ప్లాట్ నంబర్ 17లోని 4.59 ఎకరాల భూమికి వజ్రా కన్‌స్ట్రక్షన్స్ ఎకరాకు ఏకంగా రూ. 136.50 కోట్ల చొప్పున బిడ్ దాఖలు చేసి భూములు దక్కించుకుంది. ఈ లెక్కన ఆ భూమి మొత్తం విలువ రూ. 626 కోట్లకు పైగానే ఉంటుంది. అయితే, భూమి కొనుగోలుకు అవసరమైన పూర్తి ఆర్థిక ఇన్వెస్ట్‌మెంట్ సొంతంగా లేనప్పటికీ.. ప్రాజెక్టు ప్రకటించి ప్రీ-లాంచ్, ఓపెన్ టు పబ్లిక్ విక్రయాల ద్వారా కొనుగోలుదారుల నుంచి ముందస్తుగా నిధులు సమీకరించి ప్రభుత్వానికి చెల్లించవచ్చని ఆ సంస్థ భావించింది. అయితే మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో ప్రీ-లాంచ్ విక్రయాలు జరగకపోవడంతో ఆ వ్యూహం ఫలించలేదు.నిర్ణీత గడువు ముగిసినా డబ్బులు చెల్లించకపోవటంతో రూ. 5 కోట్ల డిపాజిట్‌ను హెచ్ఎండీఐ జప్తు చేసింది. ఫలితంగా వజ్రా కన్‌స్ట్రక్షన్స్ రూ. 600 కోట్లకు పైగా విలువైన కోకాపేట స్థలంతో పాటు రూ. 5 కోట్ల నగదును కోల్పోయి రెండు రకాలుగా నష్టాన్ని మూటగట్టుకుంది. భవిష్యత్ ప్రాజెక్టు విక్రయాలను నమ్ముకొని ఆర్థిక సామర్థ్యానికి మించి బిడ్లు వేయడం ఎంత ప్రమాదకరమో ఈ ఘటన స్పష్టం చేస్తోందని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. చెల్లింపులు జరగని నేపథ్యంలో ప్లాట్ నంబర్ 17 కింద ఉన్న 4.59 ఎకరాల స్థలానికి త్వరలోనే మళ్లీ పారదర్శకంగా బహిరంగ వేలం నిర్వహించాలని హెచ్ఎండీఏ నిర్ణయించింది. గత వేలంలో ఎకరాకు 136.50 కోట్ల కోట్లకు పైగా పలుకగా.. కొత్త వేలంలో ఈ స్థలానికి ఎలాంటి ధర నమోదవుతుందనేది ఇప్పుడు నగర రియల్టీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.కోకాపేట్‌లోని నియోపోలిస్, గోల్డెన్ మైల్ లేఅవుట్లతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న విలువైన భూములను వేలం వేయడానికి హెచ్ఎండీఏ సిద్ధమైంది. నిధుల సమీకరణే లక్ష్యంగా వేలానికి రెడీ అయ్యారు. నియోపోలిస్‌లో ఎకరానికి కనీస ధర రూ. 120 కోట్లుగా నిర్ణయించగా.. గోల్డెన్ మైల్‌లో రూ. 70 కోట్లుగా ఫిక్స్ చేసారు. ఈ వేలం ప్రక్రియ ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 9 వరకు జరగనుంది. మోకిలా, బాచుపల్లి, సూరారం వంటి నివాస ప్రాంతాల్లోని ఖాళీ ప్లాట్లను సైతం ఈ-వేలంలో ఉంచారు.

# మాస్ డ్యాన్స్ తో షేక్ చేస్తున్న ప్రీతిరెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 13, ఎక్స్ మినిస్టర్ మల్లారెడ్డి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన ఏం మాట్లాడినా సరే సంచలనంగానే ఉంటుంది. సోషల్ మీడియాలో ఆయన చేసే కామెంట్లు.. వేసే డ్యాన్సులు.. ఇవన్నీ కూడా ట్రెండింగ్లో ఉంటాయి. మల్లారెడ్డి మాత్రమే కాదు.. ఇప్పుడు ఆయన కోడలు కూడా మామ చూపించిన దారిలోనే నడుస్తున్నట్టు తెలుస్తోంది.మల్లారెడ్డికి ఇద్దరు కుమారులు. అందులో భద్రారెడ్డి సతీమణి ప్రీతి రెడ్డి. ఈమె మల్లారెడ్డి విద్యాసంస్థలను పర్యవేక్షిస్తూ ఉంటారు. ఈమెకు సోషల్ మీడియాలో యాక్టివా ఉండడం చాలా ఇష్టం. సోషల్ కార్యక్రమాలు కూడా చేపడుతూ ఉంటారు. మల్లారెడ్డి తరహాలోనే కామెంట్లు చేస్తూ ఉంటారు. ఈమె మాట్లాడే మాటలు.. చేసే డ్యాన్సులు ఆసక్తికరంగా ఉంటాయి. అప్పట్లో ఈమె తన మామతో కలిసి దేశ ప్రధాని నరేంద్ర మోడీతో భేటీ అయ్యారు. చాలాసేపు మాట్లాడుకున్నారు. అప్పట్లోనే ప్రీతి రెడ్డి బిజెపిలో చేరుతుందని వార్తలు వచ్చాయి.గత ఏడాది బోనాల వేడుకలు జరిగినప్పుడు బిజెపి ఎంపీ.. కేంద్రమంత్రి బండి సంజయ్ తో కలిసి ఆమె కార్యకర్త ఇంటికి వెళ్లారు. అక్కడ భోజనం కూడా చేశారు. ఈమె పేరు మీద అక్కడి బిజెపి కార్యకర్తలు ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేశారు. దీంతో ప్రీతి రెడ్డి బిజెపిలో చేరుతున్నారని ప్రచారం జరిగింది. అయితే దీనిని ఆమె ఖండించలేదు. అలాగని స్వాగతించలేదు.ప్రీతి రెడ్డి నిత్యం మీడియాలో కనిపిస్తూనే ఉంటారు. సోషల్ ఆక్టివిటీ గాని.. ధార్మిక కార్యక్రమాలు గాని.. ఆధ్యాత్మిక కార్యక్రమాలు గాని.. కాలేజీకి సంబంధించిన కార్యక్రమాలు గాని. ఇలా అన్నిట్లో ఆమె పాలుపంచుకుంటూనే ఉంటారు. ఆమె డ్యాన్సులు బాగా చేస్తారు. హైదరాబాదులో జరిగిన బోనాల వేడుకలో ప్రీతి రెడ్డి సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా నిలిచారు. అంతేకాదు నెత్తికి తలపాగ చుట్టి.. బంగారు ఆభరణాలు ధరించి.. అమ్మవారి పాటలకు లయబద్ధంగా డ్యాన్సులు వేశారు. సోషల్ మీడియాలో మరోసారి సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ అయ్యారు

# రెండు కుంటల భూమి ఇస్తే ఓకే లేకపోతే అంతు చూస్తానని బెదిరింపులు

చంద్రుగొండ ఏజెన్సీ చట్టాలను అడ్డుపెట్టుకొని మండలంలో అధికారులను బెదించటం పరిపాటిగ మారిందనే విమర్శలున్నాయి. ఇటీవల సమాచారం చట్టం ప్రకారం రెవెన్యూ భూముల వివరాలను తెలుసుకున్న ఓ సామాజిక వర్గం నాయకుడు చంద్రుగొండ సబ్ రిజిస్టర్లు ను గత కొంతకాలంగా అనధికారికంగా తనకు రెండు కుంటల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేస్తూన్నాడని తెలుస్తోంది. రెవెన్యూ అధికారుల నుండి ఎలాంటి హమి రాకపోవడంతో మద్యం సేవించిన సదరు ఆ నాయకుడు ఈనెల 11 న సబ్జస్టార్ కార్యాలయంలోకి చొరబడి సబజిస్టార్?ను నేరుగా బెదిరించాడనే ఆరోపణలు వస్తున్నాయి. గంటన్నర పాటు రెవెన్యూ కార్యాలయంలో దర్జాగా కూర్చొని బెదిస్తుండటంతో విసుగు చెందిన సబ్ రిజిస్టార్ చంద్రుగొండ పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వటం, అక్కడకు పోలీసులు వచ్చిన ఎటువంటి చర్యలు తీసుకోకపోగా నిమ్మకునీరెత్తన్నట్లువ్యవరించి, రాచమర్యాదలతో పోలీసులు సదరు ఆ వ్యక్తి ని అక్కడ నుండి పంపించడం గమనార్హం. తనను బెదిరించి, కార్యాలయ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిని కనీసం పోలీసులు అదుపులోకి తీసుకోలేదని సబరిజిస్టార్ ఉన్నతాధికారులకు, తోటి తహసీల్దార్ల వద్ద వాపొయిన్నట్లు విశ్వసనీయ సమాచారం. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోకి దౌర్జన్యంగా ప్రవేశించటమే కాకుండా మద్యం మత్తులో విధులకు ఆటంకం కలిగించిన అతనిపై పోలీసు, రెవెన్యూశాఖలు చర్యలు తీసుకోకపోవడం పట్ల మండల ప్రజలు విస్మయం చెందుతున్నారు.

# గుంతకల్లు కసాపురం గ్రామంలో విషాదం విద్యుత్ ఘాతంతో రైతు దుర్మరణం




పొలంలో విషాద ఘటన అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం కసాపురం గ్రామానికి చెందిన రైతు బోయ ఆంజనేయులు ఉదయం తన పొలంలో కంది సేద్యం పనుల కోసం వెళ్లారు. ఎద్దును కాపాడబోయి ప్రాణాలర్పణ: పొలంలో తెగిపడి ఉన్న విద్యుత్ వైరు ఎద్దుపై పడటంతో, దాన్ని కాపాడేందుకు ఆంజనేయులు ప్రయత్నించారు. ఈ క్రమంలో తీవ్ర విద్యుత్ ఘాతానికి గురై ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై ఆగ్రహం పొలాల వద్ద తెగిపడిన విద్యుత్ వైర్లను సమయానికి సరిచేయకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తూ తీవ్ర నిరసన తెలిపారు. కేసు నమోదు ? దర్యాప్తు ప్రారంభం: సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకుని, మృతి చెందిన రైతు కుటుంబానికి తగిన పరిహారం అందించి న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# మోడీ బహుమతుల వేలంతో 52 కోట్లకు పైగా నిధులు

న్యూఢిల్లీ, ఆగస్టు 13, (న్యూస్ పల్స్) భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వివిధ సందర్భాల్లో అందే కానుకలు, స్మృతిచిహ్నాలు ఇప్పుడు ఆసక్తికరమైన అంశంగా మారాయి. ప్రధాని అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు, వివిధ సంస్థలు, ప్రముఖులు, రాజకీయ నాయకులు, క్రీడాకారులు, ఇతర ప్రతినిధులు ఆయనకు అనేక రకాల బహుమతులు, మెమెంటోలు అందజేస్తుంటారు. వీటిని కేంద్ర ప్రభుత్వం క్రమం తప్పకుండా ఇ-వేలం నిర్వహించి విక్రయిస్తోంది. ఈ వేలాల ద్వారా ఇప్పటివరకు రూ.52 కోట్లకు పైగా ఆదాయం సమకూరినట్లు కేంద్రం వెల్లడించింది.కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ లోక్‌సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ప్రధాని కానుకల వేలం ద్వారా వచ్చిన ఆదాయానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడర్న్ ఆర్ట్ ఆధ్వర్యంలో ఈ వేలం ప్రక్రియ కొనసాగుతోంది.

2021 తొలి ఎడిషన్: రూ.3.1 కోట్లు
2022 రెండో ఎడిషన్: రూ.3.6 కోట్లు
2023 మూడో ఎడిషన్: రూ.15.8 కోట్లు
2023 నాలుగో ఎడిషన్: రూ.14.4 కోట్లు
2024 ఐదో ఎడిషన్: రూ.11.16 కోట్లు
2024 ఆరో ఎడిషన్: రూ.2.24 కోట్లు
2025 ఏడో ఎడిషన్: రూ.1.89 కోట్లు

ఈ మొత్తం కలిపితే రూ.52 కోట్లకు పైగా నిధులు సమకూరినట్లు కేంద్రం తెలిపింది. సాధారణంగా ప్రధాని మోదీ జన్మదినమైన సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 31 వరకు ఈ-వేలం నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి వివరించారు. 2019కు ముందు ప్రధానికి వచ్చిన ఇలాంటి కానుకలు, స్మృతిచిహ్నాలను ఆధ్వర్యంలో ఈ తరహాలో వేలం వేసే విధానం లేదని కేంద్ర మంత్రి షేకావత్ పేర్కొన్నారు.ప్రధాని మోదీకి అందిన కానుకల్లో దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతి, కళా సంపదకు ప్రతీకలైన వస్తువులు ఉంటాయి. పెయింటింగ్స్, శిల్పాలు, హస్తకళా వస్తువులు, మతపరమైన విగ్రహాలు, చేనేత వస్త్రాలు, క్రీడా స్మృతిచిహ్నాలు వంటి అనేక రకాల వస్తువులు వేలానికి వస్తాయి. వాటిలో కొన్ని వస్తువులు భారీ ధరలు పలికాయి. గాజు ఫ్రేమ్‌లో మినియేచర్ ఆలయ నిర్మాణంతో ఉన్న తుల్జా భవానీ విగ్రహం సుమారు రూ.1.03 కోట్ల వరకు ధర పలికినట్లు సమాచారం.అయోధ్య రామమందిర మెటాలిక్ మోడల్, జమ్మూకశ్మీర్ పష్మినా షాల్, తంజావూరు రామ దర్బార్ చిత్రం, నటరాజ మెటాలిక్ విగ్రహం, గుజరాత్ రోగన్ ఆర్ట్ 'ట్రీ ఆఫ్ లైఫ్', నాగాలాండ్ చేనేత షాల్, వివిధ వస్త్రాలు, పెయింటింగ్స్ కూడా వేలంలో ఆకర్షణగా నిలిచాయి. క్రీడలకు సంబంధించిన వస్తువులు కూడా వేలంలో ప్రత్యేక ఆసక్తిని కలిగించాయి. 2024 పారాలింపిక్స్ క్రీడాకారుల బూట్లు, ఒలింపిక్, పారాలింపిక్ క్రీడా సామగ్రితో పాటు స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు సంబంధించిన జావెలిన్, రామమందిరం, కాశీ విశ్వనాథ ఆలయ నమూనాలు వంటి వస్తువులు కూడా వేలంలోకి వచ్చాయి.ప్రధాని మోదీకి వచ్చిన కానుకలను వేలం వేసి వచ్చిన ఆదాయాన్ని నమామి గంగే కార్యక్రమానికి కేటాయిస్తున్నట్లు కేంద్రం తెలిపింది. గంగా నది పరిరక్షణ, పునరుద్ధరణ, కాలుష్య నివారణ వంటి కార్యక్రమాలకు ఈ నిధులను ఉపయోగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమమైన నమామి గంగే కింద గంగా, దాని ఉపనదుల్లో కాలుష్యాన్ని తగ్గించడం, నదీ పునరుజ్జీవనం, పర్యావరణ వ్యవస్థను పరిరక్షించడం వంటి చర్యలు చేపడుతున్నారు. మురుగునీటి శుద్ధి మౌలిక సదుపాయాలు, రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, జీవవైవిధ్య పరిరక్షణ తదితర ప్రాజెక్టులు ఇందులో భాగంగా ఉన్నాయి. ఈ కార్యక్రమాన్ని నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా) అమలు చేస్తోంది.ప్రధాని మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా తనకు వచ్చిన కానుకలను వేలం వేసి వచ్చిన మొత్తాన్ని బాలికల విద్య కోసం వినియోగించేవారని కేంద్రం వెల్లడించింది. ఇప్పుడు అదే విధానాన్ని జాతీయ స్థాయిలో కొనసాగిస్తూ.. వేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని గంగా నది పరిరక్షణకు కేటాయిస్తున్నట్లు తెలిపింది. అంటే.. ప్రముఖులు, సంస్థలు ప్రధానమంత్రికి అందించిన కానుకలు వ్యక్తిగతంగా భద్రపరచడం కాకుండా.. వాటిని ప్రజా ప్రయోజనానికి ఉపయోగపడేలా వేలం వేస్తున్నారు. వేలం ద్వారా వచ్చిన నిధులు దేశంలోని కీలక పర్యావరణ కార్యక్రమానికి మళ్లించడం ఈ ప్రక్రియలో ప్రధాన అంశంగా నిలుస్తోంది.

# అమరావతి నగర నిర్మాణం మొట్టమొదటి సక్సెస్ సీడ్ యాక్సెస్ రహదారి, స్టీల్ బ్రిడ్జిల ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి సీడ్ యాక్సెస్ రహదారి, స్టీల్ బ్రిడ్జిల ప్రారంభోత్సవం అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించారు.రాష్ట్రాభివృద్ధి విజన్కు అమరావతి నగర నిర్మాణం మొట్టమొదటి సక్సెస్. తెలుగు జాతి గర్వపడేలా ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్ నిర్మాణం జరిగింది. విభజన తర్వాత ఈ ప్రాంతం నష్ట పోయింది. రాజధాని కూడా లేకుండా పోయింది. 25 పార్లమెంటు స్థానాల్లో మధ్యలో గుంటూరు జిల్లా ఉంది. అందుకే రాజధానిని ఇక్కడ పెట్టాలని సంకల్పించాం. విస్తృత చర్చల తర్వాత మాపై విశ్వాసంతో రైతులు రాజధాని నిర్మాణం కోసం ముందుకు వచ్చారని అన్నారు.

రాష్ట్ర రాజధాని కోసం భూములు త్యాగం చేసిన రైతులందరికీ పాదాభివందనం చేస్తున్నాను. సింగపూర్ అమరావతి బృహత్ ప్రణాళికకు పూర్తిగా సహకరించింది. అలాంటి సింగపూర్ను గత పాలకులు వేధింపులకు గురిచేశారు. ప్రభుత్వ కాంప్లెక్స్ భవనాలను యూనీక్గా ఉండాలని లండన్కు చెందిన నార్మన్ ఫాస్టర్స్తో డిజైన్లు చేయించాం. కొందరు గ్రాఫిక్స్ అంటూ ఎగతాళి చేశారు. ఆ గ్రాఫిక్స్ నిజం అవుతుంటే ఎగతాళి చేసిన వాళ్లంతా తల దించుకోవాలి. అమరావతితో పాటు అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి వికేంద్రీకరించేలా ప్రణాళికలు చేశాం. అసెంబ్లీలో రాజధాని నిర్మాణానికి 40 వేల ఎకరాలు కావాలన్న వ్యక్తి తర్వాత మూడు రాజధానులు అని మాటతిప్పేశాడు. 2019-24 మధ్య రైతుల ఉద్యమాన్ని చరిత్ర మర్చిపోదు. ఆ ఉద్యమానికి మేం కూడా జోలె పట్టి రైతులకు సహకరించాం. అమరావతి రాజధాని నిర్మాణానికి దేశంలోని పవిత్ర నదులు, ప్రాంతాల ఆశీర్వాదం కోసం నీరు, మట్టిని తెప్పించి ఇక్కడ కలిపాం. తిరుమల తర్వాత అంతటి విశిష్టమైన

శ్రీవారి ఆలయం అమరావతిలో ఉండాలని ఆకాంక్షించాను. అమరావతితో పాటు రాష్ట్రం అంతటా అభివృద్ధి కావాలన్నదే నా ఆకాంక్ష. హెల్తీ వెల్తీ హ్యాపీ ఏపీ కావాలన్నదే నా ఆకాంక్ష. అమరావతిని ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని అన్నారు.

# తాండూర్ రైల్వే స్టేషన్‌లో భారీగా ఎండు గంజాయి పట్టివేత.. 52.8 కిలోలు స్వాధీనం

## ఒడిశా నుంచి తాండూర్‌కు గంజాయి స్మగ్లింగ్.. ముగ్గురు నిందితులు అరెస్ట్

## గంజాయి విలువ రూ.13.20 లక్షలు.. రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం.

వికారాబాద్ తాండూర్ స్టేషన్లో భారీగా ఎండు గంజాయి పట్టుబడింది.ఒడిశా నుంచి గంజాయిని తాండూర్‌కు తరలించి విక్రయించేందుకు తీసుకొచ్చిన ముగ్గురు వ్యక్తులను అధికారుల తనిఖీలలో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 4 సూటి కేసులలో సుమారు 52.8 కిలోల ఎండు గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.రంగారెడ్డి డివిజన్ పరిధిలోని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, తాండూర్ ఎక్సైజ్ సిబ్బంది సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో ఈ భారీ గంజాయి పట్టుబడింది.ఈ క్రమంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ సూపరింటెంట్ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.అధికారులకు అందిన విశ్వసనీయ సమాచారంతో ౹ుఈ హైదరాబాద్, ఎన్‌ఫోర్స్‌మెంట్ రంగారెడ్డి, ఆఈ వికారాబాద్, స్థానిక ఎక్సైజ్ అధికారులు సమన్వయంతోవికారాబాద్ జిల్లా తాండూర్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా తెలిపారు. రైల్వే స్టేషన్ పార్కింగ్ ప్లేస్ లో అనుమానితులుగా ఉన్న గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఇచ్చినట్లుగా తెలిపారు. పోలీసులను గమనించిన వారు అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించగా.. సిబ్బంది చాకచక్యంగా వారిని అదుపులోకి తీసుకున్నారు.అనంతరం వారి వద్ద ఉన్న నాలుగు ట్రావెలింగ్ బ్యాగులను తనిఖీ చేయగా భారీ మొత్తంలో ఎండు గంజాయి బయటపడింది.మొత్తం సుమారు 52.8 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు రెండు మొబైల్ ఫోన్లను కూడా సీజ్ చేసినట్లుగా తెలిపారు.అదుపులోకి తీసుకున్న ముగ్గురు వ్యక్తులు. మధు అలియాస్ థాన్, వయసు 34 సంవత్సరాలు.2. శితా నాహక్, వయసు 25 సంవత్సరాలు.3. నీలు మండల్, వయసు 22 సంవత్సరాలు. వీరంతా ఒడిశాలోని గంజాం జిల్లా ప్రాంతం నుంచి గంజాయిని తీసుకువచ్చి ఇతర ప్రాంతాల్లో విక్రయించేందుకు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు.స్వాధీనం చేసుకున్న గంజాయి విలువను కిలోకు సుమారు రూ.25 వేల చొప్పున లెక్కిస్తే.. మొత్తం విలువ సుమారు రూ.13.20 లక్షలు ఉంటుందని తెలిపారు.గంజాయి, ఇతర మత్తు పదార్థాలను అక్రమంగా రవాణా చేయడం, విక్రయించడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని అధికారులు హెచ్చరించారు. అక్రమ మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.గంజాయి అక్రమ రవాణాపై అధికారులు ప్రత్యేక నిఘా కొనసాగుతుందని.ఎక్కడైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం ఉంటే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. సమాచార వివరాలను గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు.

# పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి

### ప్రతి కేసు దర్యాప్తు పురోగతిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి

### విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవు: సీపీ అంబర్ కిషోర్ ఝా

గోదావరిఖని పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించి, నాణ్యమైన దర్యాప్తు ద్వారా నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్

కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు.విధుల్లో అలసత్వం,నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. సీసీటీఎన్ఎస్ 2.0 ద్వారా కమిషనరేట్ పరిధిలోని పెండింగ్ కేసులు,నిందితుల అరెస్టులు,దర్యాప్తు పురోగతి,నేర నియంత్రణ చర్యలను సమీక్షించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న, పాత కేసుల దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని,వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.సీసీటీఎన్ఎస్ 2.0లో ప్రతి కేసుకు సంబంధించిన ప్రతి అంశాన్ని స్టేషన్ హౌస్ ఆఫీసర్లు,దర్యాప్తు అధికారులు సకాలంలో నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. నిందితుల అరెస్టుల్లో ఎలాంటి జాప్యం చేయరాదని ఆదేశించారు. తీవ్రమైన నేరాలు, ఎన్‌డీపీఎస్ కేసులు, నేరాల పెరుగుదలకు సంబంధించిన కేసులు,కీలక నివేదికల పెండింగ్ అంశాలపై డీసీపీలు, ఏసీపీలు తమ పరిధిలోని కేసులను సీసీటీఎన్ఎస్ ద్వారా క్రమం తప్పకుండా సమీక్షించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఈ-సమన్లను త్వరితగతిన పరిష్కరించి,వాటి పురోగతిపై నిరంతరం సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు.ఆస్తి సంబంధిత కేసులు,చిట్‌ఫండ్, ఆర్థిక నేరాలు, సీఎంఆర్ బియ్యం అక్రమ మళ్లింపు కేసుల్లో ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, నిందితుల అరెస్టులు తదితర పెండింగ్ అంశాలను సమీక్షించారు.ఆర్థిక నేరాల్లో ఆస్తుల గుర్తింపు,స్వాధీనం, జప్తుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నందున ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆర్థిక నేరాల కేసుల్లో నిబంధనల ప్రకారం ఆస్తుల జప్తు ప్రక్రియను తప్పనిసరిగా చేపట్టాలని ఆదేశించారు.కొత్త నేర న్యాయ చట్టాలపై ప్రతి పోలీస్ అధికారి పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఇతర రాష్ట్రాలు,జిల్లాల పోలీస్ అధికారులతో సమన్వయం కొనసాగిస్తూ కేసుల దర్యాప్తులో అవసరమైన సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలని ఆదేశించారు.సైబర్ నేరాలు, సమాచార సాంకేతికతకు సంబంధించిన కేసులను నిర్దేశిత ప్రామాణిక విధానాల ప్రకారం నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని ఆదేశించారు. జీఆర్ఎం,ఎంఆర్ఎం పనితీరును మెరుగుపరుచుకోవాలని,సమన్వయ పోర్టల్‌పై అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు.ప్రతి ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరై తమ పరిజ్ఞానాన్ని ెం ం పొ ం ది ం చ ు కో వా ల ని తెలిపారు.గంజాయి,అక్రమ ఇసుక రవాణా, పేకాట,ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం అక్రమ తరలింపు తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.పోలీస్ అధికారులు, సిబ్బంది 24 గంటలూ, వారంలో ఏడు రోజులూ ప్రజలకు అందుబాటులో ఉండటం తమ ప్రాథమిక బాధ్యతగా గుర్తించాలని సీపీ తెలిపారు.సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు.నేరం జరిగిన వెంటనే సంఘటనా స్థలాన్ని సందర్శించి,ప్రజల ఫిర్యాదులను స్వీకరించి,వారికి పోలీసులపై నమ్మకం, భరోసా కలిగేలా వ్యవహరించాలని ఆదేశించారు.పోలీసుల ప్రవర్తనే పోలీస్ శాఖ ప్రతిష్ఠను నిర్ణయిస్తుందని సీపీ స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యానికి ఎలాంటి తావివ్వకూడదని తెలిపారు. అధికారులు,సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్,పెద్దపల్లి డీసీపీ బి.రామ్‌రెడ్డి, అదనపు డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాశ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్,ట్రాఫిక్ ఏసీపీ సి.హెచ్.శ్రీనివాస్, సీసీఎస్ ఏసీపీలు రవీందర్, ప్రవీణ్ కుమార్,టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు, సైబర్ క్రైమ్ ఏసీపీ రంగారెడ్డి,ఏఆర్ ఏసీపీ ప్రతాప్‌తో పాటు ఇతర సీఐలు,ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.పెండింగ్ కేసులను

సత్వరమే పరిష్కరించాలి ప్రతి కేసు దర్యాప్తు పురోగతిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలివిధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవు: సీపీ అంబర్ కిషోర్ ఝా ప్రజా క్రాంతి, గోదావరిఖని :పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించి, నాణ్యమైన దర్యాప్తు ద్వారా నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు.విధుల్లో అలసత్వం,నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. సీసీటీఎన్ఎస్ 2.0 ద్వారా కమిషనరేట్ పరిధిలోని పెండింగ్ కేసులు,నిందితుల అరెస్టులు,దర్యాప్తు పురోగతి,నేర నియంత్రణ చర్యలను సమీక్షించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న, పాత కేసుల దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని,వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.సీసీటీఎన్ఎస్ 2.0లో ప్రతి కేసుకు సంబంధించిన ప్రతి అంశాన్ని స్టేషన్ హౌస్ ఆఫీసర్లు,దర్యాప్తు అధికారులు సకాలంలో నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. నిందితుల అరెస్టుల్లో ఎలాంటి జాప్యం చేయరాదని ఆదేశించారు. తీవ్రమైన నేరాలు, ఎన్‌డీపీఎస్ కేసులు, నేరాల పెరుగుదలకు సంబంధించిన కేసులు,కీలక నివేదికల పెండింగ్ అంశాలపై డీసీపీలు, ఏసీపీలు తమ పరిధిలోని కేసులను సీసీటీఎన్ఎస్ ద్వారా క్రమం తప్పకుండా సమీక్షించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఈ-సమన్లను త్వరితగతిన పరిష్కరించి,వాటి పురోగతిపై నిరంతరం సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు.ఆస్తి సంబంధిత కేసులు,చిట్‌ఫండ్, ఆర్థిక నేరాలు, సీఎంఆర్ బియ్యం అక్రమ మళ్లింపు కేసుల్లో ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, నిందితుల అరెస్టులు తదితర పెండింగ్ అంశాలను సమీక్షించారు.ఆర్థిక నేరాల్లో ఆస్తుల గుర్తింపు,స్వాధీనం, జప్తుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నందున ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆర్థిక నేరాల కేసుల్లో నిబంధనల ప్రారం ఆస్తుల జప్తు ప్రక్రియను

తప్పనిసరిగా చేపట్టాలని ఆదేశించారు.కొత్త నేర న్యాయ చట్టాలపై ప్రతి పోలీస్ అధికారి పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఇతర రాష్ట్రాలు,జిల్లాల పోలీస్ అధికారులతో సమన్వయం కొనసాగిస్తూ కేసుల దర్యాప్తులో అవసరమైన సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలని ఆదేశించారు.సైబర్ నేరాలు, సమాచార సాంకేతికతకు సంబంధించిన కేసులను నిర్దేశిత ప్రామాణిక విధానాల ప్రకారం నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని ఆదేశించారు. జీఆర్ఎం,ఎంఆర్ఎం పనితీరును మెరుగుపరుచుకోవాలని,సమన్వయ పోర్టల్‌పై అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు.ప్రతి ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరై తమ పరిజ్ఞానాన్ని ెం ం పొ ం ది ం చ ు కో వా ల ని తెలిపారు.గంజాయి,అక్రమ ఇసుక రవాణా, పేకాట,ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం అక్రమ తరలింపు తదితర

చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.పోలీస్ అధికారులు, సిబ్బంది 24 గంటలూ, వారంలో ఏడు రోజులూ ప్రజలకు అందుబాటులో ఉండటం తమ ప్రాథమిక బాధ్యతగా గుర్తించాలని సీపీ తెలిపారు.సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు.నేరం జరిగిన వెంటనే సంఘటనా స్థలాన్ని సందర్శిపెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి ప్రతి కేసు దర్యాప్తు పురోగతిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలివిధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవు: సీపీ అంబర్ కిషోర్ ఝా ప్రజా క్రాంతి, గోదావరిఖని :పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించి, నాణ్యమైన దర్యాప్తు ద్వారా నిందితులకు శిక్ష పడేలా

చర్యలు తీసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు.విధుల్లో అలసత్వం,నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. సీసీటీఎన్ఎస్ 2.0 ద్వారా కమిషనరేట్ పరిధిలోని పెండింగ్ కేసులు,నిందితుల అరెస్టులు,దర్యాప్తు పురోగతి,నేర నియంత్రణ చర్యలను సమీక్షించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న, పాత కేసుల దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని,వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.సీసీటీఎన్ఎస్ 2.0లో ప్రతి కేసుకు సంబంధించిన ప్రతి అంశాన్ని స్టేషన్ హౌస్ ఆఫీసర్లు,దర్యాప్తు అధికారులు సకాలంలో నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. నిందితుల అరెస్టుల్లో ఎలాంటి జాప్యం చేయరాదని ఆదేశించారు. తీవ్రమైన నేరాలు, ఎన్‌డీపీఎస్ కేసులు, నేరాల పెరుగుదలకు సంబంధించిన కేసులు,కీలక నివేదికల పెండింగ్

అంశాలపై డీసీపీలు, ఏసీపీలు తమ పరిధిలోని కేసులను సీసీటీఎన్ఎస్ ద్వారా క్రమం తప్పకుండా సమీక్షించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఈ-సమన్లను త్వరితగతిన పరిష్కరించి,వాటి పురోగతిపై నిరంతరం సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు.ఆస్తి సంబంధిత కేసులు,చిట్‌ఫండ్, ఆర్థిక నేరాలు, సీఎంఆర్ బియ్యం అక్రమ మళ్లింపు కేసుల్లో ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, నిందితుల అరెస్టులు తదితర పెండింగ్ అంశాలను సమీక్షించారు.ఆర్థిక నేరాల్లో ఆస్తుల గుర్తింపు,స్వాధీనం, జప్తుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నందున ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆర్థిక నేరాల కేసుల్లో నిబంధనల ప్రకారం ఆస్తుల జప్తు ప్రక్రియను తప్పనిసరిగా చేపట్టాలని ఆదేశించారు.కొత్త నేర న్యాయ చట్టాలపై ప్రతి పోలీస్ అధికారి పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఇతర రాష్ట్రాలు,జిల్లాల పోలీస్ అధికారులతో సమన్వయం కొనసాగిస్తూ కేసుల దర్యాప్తులో అవసరమైన సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలని ఆదేశించారు.సైబర్ నేరాలు, సమాచార సాంకేతికతకు సంబంధించిన కేసులను నిర్దేశిత ప్రామాణిక విధానాల ప్రకారం నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని ఆదేశించారు.

# మానవ వన్యప్రాణి సంఘర్షణ లేకుండా జీవనం అత్యున్నతమైనది

### ఆంధ్రప్రదేశ్ ఏనుగుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యమిస్తుంది

### కుంకీ ఏనుగుల రాకతో ఆంధ్రప్రదేశ్ లో అద్భుత ఫలితాలు

### రాష్ట్రంలోనూ ఏటా రెండు కుంకీ ఏనుగులకు శిక్షణ ఇచ్చే విధంగా ప్రణాళికలు

### అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిపవన్ కళ్యాణ్




ఆంధ్రప్రదేశ్ ఏజెన్సీ ప్రాంతాల్లో మదపుటేనుగుల గుంపులతో తీవ్రమైన సమస్యలుండేవి. సుమారు 132 నుంచి 142 ఏనుగులు గుంపులుగా ఏజెన్సీ ప్రాంతంలో కల్లోలం సృష్టించేవి. చిత్తూరు జిల్లా పలమనేరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఏనుగుల గుంపులు పంటపొలాల మీద పడి పంటలను ధ్వంసం చేయడం, అడ్డొచ్చే వారిపై దాడులు చేయడంతో ప్రజల్లో భయందోళనలు నెలకొన్నాయి. నేను అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖల బాధ్యతలను తీసుకున్న తర్వాత మొదటిగా ప్రజలకు, ఏనుగులతో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడం మీదనే దృష్టి సారించాన'ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. మదపుటేనుగులను నిరోధించేందుకు నాలుగు కుంకీ ఏనుగులను కర్ణాటక ప్రభుత్వ సహాయంతో తీసుకొచ్చి, వాటికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి మానవులు ? వన్య ప్రాణుల మధ్య ఘర్షణలను నివారించే ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. వీటివల్ల ఏజెన్సీ ఏరియాల్లో మంచి ఫలితాలొస్తున్నాయని చెప్పారు. అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో భాగంగా విశాఖపట్నంలో ప్రత్యేకంగా నిర్వహించిన జాతీయ స్థాయి సెమినార్ లో కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "ఏనుగులు పర్యావరణ సమతుల్యతకు వారధిగా నిలుస్తాయి. దేశ వన్యప్రాణి వారసత్వానికి అవి చిహ్నాలు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏనుగుల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 2014 నుంచి దేశంలోని ఏనుగుల సంరక్షణ కేంద్రాలు 26 నుంచి 33కు పెరిగాయి. కారిడార్ల రక్షణ, 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్' బలోపేతం, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 150 ఏనుగుల కారిడార్లను దేశవ్యాప్తంగా గుర్తించడం ద్వారా ఏనుగుల ఆవాసాలకు ఇబ్బంది లేకుండా ఉంది. ఈ విషయంలో కేంద్రం అనుసరిస్తున్న విధానాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అనుసరిస్తోంది. ఏనుగుల సంరక్షణ కోసం ప్రత్యేకంగా దృష్టి సారించింది. కుంకీ ఏనుగులను రాష్ట్రానికి అందించడంలో సహకరించిన కర్ణాటక రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శ్రీ సిద్ధరామయ్య గారికి, ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కి, అప్పటి అటవీ, పర్యావరణ శాఖమంత్రి ఈశ్వర్ ఖండ్రే కి ఈ సందర్భంగా మరోసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇది కేవలం రెండు రాష్ట్రాల మధ్య సహకారం మాత్రమే కాదు. ఇది ప్రజలు, ప్రకృతి, వన్యప్రాణుల సంరక్షణ కోసం సాగుతున్న పరస్పర సహకారం.

కుంకీ ఏనుగులు ఇప్పటికే మదపుటేనుగులు చేసే విధ్వంసాలను అరికట్టే 15 కార్యకలాపాలలో సహాయపడ్డాయి. దీనివల్ల అటవీ సరిహద్దు ప్రాంతాల్లో మానవ మరణాలు 70 శాతం తగ్గింది. పంట నష్టం కూడా తగ్గింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున కూడా సొంత కుంకీ ఏనుగులకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించాం. ఇప్పటికే ఒక శిక్షణ పొందిన కుంకీ ఏనుగు జయంత్ పార్వతీపురం మన్యం ప్రాంతంలో ఉంది. ప్రతి ఏటా రెండు కుంకీ ఏనుగులకు శిక్షణ ఇవ్వాలనేది మా ప్రణాళిక. హనుమాన్ ప్రాజెక్టుతో మంచి ఫలితాలుమానవులు ? వన్య ప్రాణుల మధ్య నెలకొన్ని ఘర్షణలను పూర్తిగా నిరోధించేందుకు, వన్య ప్రాణులను రక్షణ కోసం రూపొందిన హనుమాన్ ప్రాజెక్టుతో మంచి ఫలితాలు వస్తున్నాయి. వేగవంతమైన స్పందన, సాంకేతికత, వణ్య ప్రాణులతో కలిగే నష్ట నివారణ కోసం సమగ్ర మానవ-వన్యప్రాణుల సంఘర్షణ నిర్వహణ వ్యవస్థ అయిన ఊ.ం.ఔ.జ.ఓ.ం.ఔ (హనుమాన్) ప్రాజెక్టును 2026, మార్చిలో ప్రారంభించాం. 93 స్పందన వాహనాలు, 7 వన్యప్రాణి అంబులెన్స్‌లను ఈ ప్రాజెక్టులో సిద్ధం చేశాం. ఇప్పటి వరకు 200కు పైగా వన్యప్రాణులు రక్షించడమే కాకుండా, 30కి పైగా వన్యప్రాణులను తరలింపు కార్యక్రమం జరిగింది. సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు.. సమాజాన్ని దీనిలో భాగస్వామ్యం చేయాలనే లక్ష్యంతో ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నాం. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ప్రతి రైతు భయం లేకుండా సాగు చేయగలిగే పరిస్థితికి చేరుకోవాలన్నదే లక్ష్యం. వణ్య ప్రాణులను, ప్రజలను విడదీయడం మా ఉద్దేశం కాదు... ప్రజలు, వన్యప్రాణులు ఒకే ప్రదేశంలో సురక్షితంగా కలిసి జీవించగలిగే భవిష్యత్తును సృష్టించడమే అసలైన విజయం" అని అన్నారు.ప్రాజెక్ట్ ఎలిఫెంట్ 30 జెయింట్ స్టెప్స్ పుస్తకావిష్కరణఅంతర్జాతీయ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో భాగంగా అటవీ శాఖ ప్రత్యేకంగా రూపొందించిన "ప్రాజెక్ట్ ఎలిఫెంట్ 30 జెయింట్ స్టెప్స్" పుస్తకాన్ని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ సహాయ మంత్రి శ్రీ కీర్తివర్ధన్ సింగ్ గారితో కలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దక్షిణ భారతదేశంలో ఏనుగుల సంరక్షణకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ తోపాటు వైల్డ్ లైఫ్ సైన్స్ కి సంబంధించిన పలు పుస్తకాలను విడుదల చేశారు. అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ కలంకారీ కళాకారులు రూపొందించిన ప్రత్యేక కళాఖండాన్ని కూడా ఆవిష్కరించారు. అనంతరం దేశవ్యాప్తంగా 21,450 పాఠశాలల్లో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో 20 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఏనుగుల సంరక్షణ చర్యల్లో ప్రాణాలు కోల్పోయిన ఒడిశాకి చెందిన క్షేత్ర స్థాయి అటవీ శాఖ అధికారి జుగల్ నాయక్ కు గజ గౌరవ్ అవార్డును అందజేశారు. కుటుంబాలను సత్కరించి, ఏనుగుల పరిరక్షణ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడంలో విశేష కృషి చేసిన, రక్షణ చర్యల్లో పాల్గొన్న సిబ్బందికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ , పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి తన్మయ్ కుమార్ , అటవీ శాఖ డైరెక్టర్ జనరల్, ప్రత్యేక కార్యదర్శి సుశీల్ కుమార్ అవస్థి , రాష్ట్ర అటవీ మరియు పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే , పీసీసీఎఫ్ డాక్టర్ పి.వి. చలపతిరావు, ప్రాజెక్ట్ ఎలిఫెంట్ స్టీరింగ్ కమిటీ సభ్యులు, భారత ప్రభుత్వ, రాష్ట్ర అటవీ శాఖల ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు పాల్గొన్నారు.

## మేడిపల్లి ఏసీపీ కార్యాలయంలో సీపీ సుమతి ఆకస్మిక తనిఖీ

మేడ్చల్ మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధి మేడిపల్లి ఏసీపీ కార్యాలయాన్ని సీపీ సుమతి ఆకస్మికంగా తనిఖీ చేసారు. సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరణ.. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఉప్పల్ డీసీపీ సురేష్ కుమార్, ఏసీపీ మోహన్ కుమార్, ఇన్స్పెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. కేసులు, పెండింగ్ దర్యాప్తులు, సిబ్బంది వివరాలు, పోలీస్టేషన్ల సమస్యలపై ఆరాతీసారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి, సమస్యలపై త్వరితగతిన స్పందించాలని సిబ్బందికి సూచించారు.

# సైబర్ మోసాలకు కొత్త ఎత్తుగడ.. అప్రమత్తతే అసలైన ఆయుధం

## (హెచ్.ప్రతాప్)

డిజిటల్ ప్రపంచం విస్తరిస్తున్న కొద్దీ సైబర్ నేరగాళ్ల మోసపూరిత వ్యూహాలు కూడా మరింత అధునాతనంగా మారుతున్నాయి. తాజాగా హైదరాబాద్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేసి పదవీ విరమణ పొందిన వ్యక్తి రూ.3.25 లక్షలు కోల్పోయిన ఘటన ఇందుకు తాజా ఉదాహరణ. ఎన్నికల సంఘం అధికారులమంటూ గుర్తుతెలియని వ్యక్తులు పంపిన నకిలీ సందేశం, వెరిఫికేషన్ లింక్, హానికరమైన ఏపీకే ఫైల్ ద్వారా ఆయనను నమ్మించి మోసానికి పాల్పడ్డారు. 48 గంటల్లో ధ్రువీకరణ పూర్తి చేయాలంటూ తొందరపెట్టడం, స్వల్ప మొత్తంలో చెల్లింపు చేయించడం, అనంతరం వీడియో కాల్ ద్వారా నమ్మకం కల్పించడం వంటి దశలవారీ వ్యూహాన్ని ఉపయోగించినట్లు వార్తా నివేదికలు పేర్కొంటున్నాయి.

ఈ ఘటనలో అత్యంత ముఖ్యమైన పాఠం ఏమిటంటే మోసం సాంకేతికతతో మాత్రమే జరగదు.. మనలో కలిగించే తొందర, భయం, నమ్మకాన్ని కూడా నేరగాళ్లు ఆయుధాలుగా మార్చుకుంటారు. ప్రభుత్వ సంస్థ పేరు కనిపించిందని సందేశాన్ని నిజమని భావించకూడదు. ఓటరు సంబంధిత సేవల కోసం ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్లు, ఓటర్ సేవా పోర్టల్ వంటి ధృవీకరిత మార్గాలనే ఉపయోగించాలి.

తెలియని వ్యక్తులు పంపే ఎూాఖ ఫైళ్లను ఇన్‌స్టాల్ చేయడం అత్యంత ప్రమాదకరం. ఇలాంటి యాప్‌లు ఫోన్‌లోని సున్నితమైన సమాచారం, సందేశాలు లేదా ఇతర అనుమతులను దుర్వినియోగం చేసే అవకాశం ఉంటుంది. యాప్ పేరును చూసి అది అధికారికమైనదని భావించకూడదు. అధికారిక యాప్ స్టోర్ల నుంచే అప్లికేషన్లు డౌన్‌లోడ్ చేసుకోవడం, అవసరం లేని యాప్ అనుమతులను నిలిపివేయడం, ఫోన్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడం అవసరం.

మరో ముఖ్యమైన జాగ్రత్త చిన్న మొత్తంలో చెల్లింపు చేయమన్నా ముందుగా ఆలోచించడం. రూ.4, రూ.5 వంటి చిన్న మొత్తాలను అడగడం ద్వారా నేరగాళ్లు బాధితుడికి అనుమానం రాకుండా చేస్తారు. ఎూా,ూ×చీ, పాస్‌వర్డ్, బ్యాంకు వివరాలు, కార్డు సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోకూడదు. వీడియో కాల్ ద్వారా ఎవరైనా ముఖ ధ్రువీకరణ లేదా ఇతర ప్రక్రియ చేయమంటే సంబంధిత సంస్థను స్వయంగా సంప్రదించి నిర్ధారించుకోవాలి.

మోసం జరిగిన తర్వాత సిగ్గుతో లేదా భయంతో ఆలస్యం చేయడం మరింత నష్టానికి దారితీయవచ్చు. వెంటనే బ్యాంకును సంప్రదించి ఖాతాను భద్రపరచడంతో పాటు 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలి. జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చు. అధికారిక పోర్టల్ ప్రకారం ఆర్థిక సైబర్ మోసాల బాధితులు 1930ను సంప్రదించవచ్చు.

వృద్ధులు, పదవీ విరమణ పొందినవారు, డిజిటల్ సేవలపై పరిమిత అవగాహన ఉన్నవారికి కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా అవగాహన కల్పించాలి. ఆగాలి.. ఆలోచించాలి.. అధికారికంగా ధృవీకరించాలి.. ఆ తర్వాతే స్పందించాలి అనే నాలుగు దశల అలవాటు ప్రతి డిజిటల్ వినియోగదారుడికి రక్షణ కవచంగా మారాలి. సైబర్ నేరాలను ఎదుర్కోవడంలో చట్ట అమలు సంస్థల అప్రమత్తత ఎంత అవసరమో, పౌరుల డిజిటల్ క్రమశిక్షణ కూడా అంతే కీలకం.

# ప్రైవేట్ జూనియర్ కాలేజీల ధ్రువపత్రాలపై సమగ్ర విచారణ జరిపించాలి

## TGBIE కార్యదర్శి అభిలాష అభినవ్ ను కలిసి వినతిపత్రం అందజేసిన పి డి ఎస్ యూ తెలంగాణ రాష్ట్ర కమిటీ




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్, ఆగస్టు 13, తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేట్ జూనియర్ కాలేజీలకు పర్మిషన్/గుర్తింపు, మరియు అఫిలియేషన్,రెన్యువల్ మంజూరు చేసే సమయంలో సమర్పిస్తున్న ఫైర్ ఎన్ ఓసి,బిల్డింగ్ స్టబిలిటీ సరిఫికెట్ అప్రూవ్డ్ ,బిల్డింగ్ ప్లాన్,శానిటేషన్,డ్రింకింగ్ వాటర్ తదితర ధ్రువపత్రాల నిజానిజాలను సమగ్రంగా పరిశీలించాలని PDSU తెలంగాణ రాష్ట్ర కమిటీ కోరింది.

ఈ మేరకుూాణూాఖ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కె. పవన్ కుమార్‌లి , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. గణేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ ప్రతినిధులు తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి (TGBIE) కార్యదర్శి అభిలాష అభినవ్, ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యదర్శి వినతిపత్రాన్ని స్వీకరించి, సమస్యపై సానుకూలంగా స్పందించారని PDSU తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కె. పవన్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. గణేష్ లు తెలిపారు.

వినతిపత్రంలో పేర్కొన్న అంశాలను పరిశీలించిన అనంతరం, ఈ వ్యవహారంపై కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరిపిస్తామని కార్యదర్శి అభిలాష అభినవ్, హామీ ఇచ్చారు.ఇంటర్మీడియట్ విద్యా మండలి (TGBIE) కార్యదర్శి అభిలాష అభినవ్, ను కలిసి వారిలో

కె. పవన్ కుమార్
రాష్ట్ర అధ్యక్షులు
ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (PDSU)
తెలంగాణ రాష్ట్ర కమిటీ

కె. గణేష్
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (PDSU)
తెలంగాణ రాష్ట్ర కమిటీ

బి. ఎం. వంశీ,
రాష్ట్ర సహాయ కార్యదర్శి
ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (PDSU)
తెలంగాణ రాష్ట్ర కమిటీ తదితరులు పాల్గొన్నారు

# హర్ ఘర్ తిరంగా ర్యాలీ




**అమీర్పేట్ (ప్రజాబలం ప్రతినిధి ) ఆగస్టు 13** అమీర్‌పేట్ డివిజన్ అధ్యక్షులు అనంత పవన్ కుమార్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని దేశభక్తి భావంతో ఘనంగా నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా బురుగుల శ్యామ్ సుందర్ గౌడ్ దిశా కమిటీ సభ్యులు, శ్రీమతి కేటినేని సరళ , అమీర్‌పేట్ డివిజన్ కార్పొరేటర్, సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు కాసాని శ్రీశైలం గౌడ్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీలు చందు ముదిరాజ్ , రజిత రెడ్డి , సోషల్ మీడియా రాకేష్ గౌడ్ బిక్షపతి గౌడ్ , ఎంఎస్ విఠల్ (టోలీ ఇన్‌చార్జ్), సీనియర్ నాయకులు, మహిళా మోర్చా, యువ మోర్చా నాయకులు అన్ని మోర్చాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.దేశభక్తి భావాన్ని చాటుతూ హర్ ఘర్ తిరంగా ర్యాలీ అత్యంత ఘనంగా విజయవంతమైంది.

# ఎఫ్ ఆర్ సి నిర్ణయాన్ని సవాలు చేస్తూ హైకోర్టు లో బిజెపి పిటిషన్

## బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ ఆగస్ట్ 13: తెలంగాణ భుత్వం ఎలక్టోరల్ ప్రక్రియలో భాగంగా, ఓటర్ల జాబితాలో పేర్ల నమోదుకు ఐడెంటిటీ ప్రూఫ్‌గా చెల్లుబాటు అయ్యేలా 'ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికేట్' (FRC)ని తీసుకువచ్చింది.దురదృష్టవశాత్తు, రాష్ట్ర ప్రభుత్వం దుర్బుద్ధితో (Malafide intention) ఈ FRCని ప్రవేశపెట్టింది. దీని ద్వారా బోగస్ ఓటర్లకు, ఒకే పౌరుడికి వేర్వేరు ప్రాంతాల్లో మల్టిపుల్ ఓట్లు ఉండేలా చేయడానికి, చివరికి సరైన గుర్తింపు లేని వ్యక్తులు కూడా ఓటర్ల జాబితాలో చేరేలా మార్గం సుగమం చేశారు.

ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై భారతీయ జనతా పార్టీ తక్షణమే ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ECI)కి ఫిర్యాదు చేస్తూ ప్రాతినిధ్యం వహించింది. మా అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న ECI, ఓటర్ల జాబితాలో ఎన్‌రోల్‌మెంట్ కోసం FRC సర్టిఫికేట్‌ను ఉపయోగించడానికి వీల్లేదని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఈసీ తన ఆర్డర్‌లో మేము లేవనెత్తిన అంశాలను ప్రధానంగా చర్చించింది. 2013 లో వచ్చిన ఈసీ మార్గదర్శకాల ప్రకారం.. ఈ ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికేట్ అనేది కేవలం రేషన్ కార్డుతో సమానమైనది మాత్రమే. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు, రేషన్ షాపుల ద్వారా రాయితీ బియ్యం పొందేందుకు మాత్రమే ఇది ఉపయోగపడుతుంది తప్ప, ఓటరు నమోదుకు అవసరమైన ఐడెంటిటీ ప్రూఫ్ కానే కాదని తేల్చిచెప్పింది.

ఎంఐఎం (MIM) కోరిక మేరకు, సరైన ఐడెంటిటీ లేని వారి పేర్లను కూడా ఓటర్ల జాబితాలో చేర్చేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ FRCని తీసుకువచ్చిందని స్పష్టమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఈ రాజ్యాంగ విరుద్ధమైన FRC నిర్ణయాన్ని సవాలు చేస్తూ భారతీయ జనతా పార్టీ వేసిన పిటిషన్‌పై ఈరోజు తెలంగాణ హైకోర్టులో విచారణలో ఉంది. మా వైఖరిపై మేము న్యాయపరంగా కూడా గట్టిగా పోరాడుతున్నాం .ఇక ఎన్యుమరేషన్ ప్రక్రియలో భాగంగా ఆగస్టు 17న ముసాయిదా ఓటర్ల జాబితా (Draft Electoral Rolls) విడుదల కానుంది. ముసాయిదా జాబితాలో పేర్లు లేని అర్హులైన పౌరులు, అలాగే జాబితాలో మార్పులు లేదా అభ్యంతరాలు ఉన్నవారు నిర్ణీత గడువులోగా తమ క్లెయిమ్స్, అభ్యంతరాలు సమర్పించవచ్చు.

అలాగే అనర్హులైన లేదా బోగస్ ఓటర్ల పేర్లపై తమ ఆబ్జెక్షన్స్ (అభ్యంతరాలు) కూడా లేవనెత్తవచ్చు. అటువంటి ఆబ్జెక్షన్లు వచ్చినప్పుడు సరైన ఆధారాలు లేని పేర్లను ఎన్నికల సంఘం తిరస్కరిస్తుంది.ఆగస్టు 17 తర్వాత కూడా ఓటు హక్కు లభించని అర్హులైన పౌరులకు, క్లెయిమ్స్ అండ్ ఆబ్జెక్షన్స్ ప్రక్రియ ద్వారా తమ ఓటును తిరిగి నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రతి నిజమైన పౌరుడి ఓటు హక్కును కాపాడే బాధ్యత బిజెపి తీసుకుంటుంది.

# ఘనంగా తెలంగాణ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆవిర్భావం

## కళాకారుల సంక్షేమం, హక్కుల పరిరక్షణే టీమా లక్ష్యం

## సినీ కళాకారులకు అండగా నిలిచేలా కార్యాచరణ




హైదరాబాద తెలంగాణ సినీ కళాకారుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, ఉపాధి అవకాశాల కల్పన, కళాకారుల సమస్యల పరిష్కారం లక్ష్యంగా తెలంగాణ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (టీమా) ఆవిర్భవించింది. హైదరాబాద్ చిక్కడపల్లిలోని టీవీ జేఏసీ కార్యాలయంలో టీమా ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సినీ పరిశ్రమకు చెందిన పలువురు ఆర్టిస్టులు, దర్శకులు, నిర్మాతలు హాజరయ్యారు.



ఈ సందర్భంగా టీమా అధ్యక్షుడిగా బీఆర్ వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కాకుమాను లూర్దు జ్యోతి, నిర్వాహక కార్యదర్శిగా మారేపల్లి లక్ష్మణ్ నేత బాధ్యతలు స్వీకరించారు. గౌరవ ముఖ్య సలహాదారులుగా జనార్దన్ రెడ్డి, నాగేష్ ముదిరాజ్, ప్రఫుల్ రామిరెడ్డి వ్యవహరించనున్నారు. సినీ నిర్మాత ఆర్. శ్రీనివాస్, సినీ దర్శకులు రామ్ కుమార్, జానీ తదితరులు కార్యక్రమంలో పాల్గొని టీమా ఏర్పాటును స్వాగతించారు.

**కళాకారుల కోసం సమిష్టి వేదిక**

సినీ పరిశ్రమలో ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న కళాకారులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించేందుకు ఒక బలమైన సమిష్టి వేదిక అవసరమనే ఉద్దేశంతో టీమాను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కళాకారుల హక్కులు, గౌరవం, సంక్షేమం కోసం టీమా నిరంతరం పనిచేస్తుందని పేర్కొన్నారు. సినిమా, టెలివిజన్, వెబ్ సిరీస్‌లు తదితర దృశ్య మాధ్యమాల్లో పనిచేస్తున్న కళాకారులను ఒకే వేదికపైకి తీసుకురావడంతో పాటు, వారి సమస్యలను సంబంధిత వర్గాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడం టీమా ప్రధాన లక్ష్యమని తెలిపారు.

**నూతన కళాకారులకు ప్రోత్సాహం**

తెలంగాణలో సినీ పరిశ్రమ విస్తరిస్తున్న నేపథ్యంలో స్థానిక కళాకారులకు మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని టీమా ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రతిభ ఉన్న నూతన కళాకారులను ప్రోత్సహించడం, వారికి మార్గదర్శకత్వం అందించడం, సీనియర్ కళాకారుల అనుభవాన్ని యువతకు అందించడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.కళాకారుల నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణా కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, పరిశ్రమలోని ప్రముఖులతో సమన్వయం చేసుకుని కళాకారులకు తగిన అవకాశాలు అందేలా కృషి చేయనున్నట్లు వెల్లడించారు.

# రైల్వే స్టేషన్ లో పబ్లిక్ అనౌన్స్మెంట్ వెంటనే ఏర్పాటు చేయాలి.

### సికింద్రాబాద్ సంచాలన్ భవనంలో సీనియర్ అధికారికి వినతిపత్రం అందజేత. రైల్వే మెంబెర్ అనుమాస శ్రీనివాస్.

గోదావరిఖని :సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని రైల్వే స్టేషన్లకు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం, స్టేషన్ల ముందు భాగంలో ఉండే సర్క్యులేటింగ్ ఏరియాలో పబ్లిక్ (ఖం) అనౌన్స్మెంట్ సిస్టమ్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (ఆఖీజఅఅ ) మెంబర్ అనుమాస శ్రీనివాస్ జీన్స్ కోరారు.?ఈ మేరకు సికింద్రాబాద్ సంచాలన్ భవన్‌లోని సీనియర్ ఆఆఇ కార్యాలయంలో అధికారి గంగుల సుమన్ ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం రైల్వే స్టేషన్ల లోపల ప్లాట్‌ఫారమ్‌లపై మాత్రమే సిస్టమ్ అనౌన్స్మెంట్లు వినిపిస్తున్నాయని తెలిపారు. దీనివల్ల స్టేషన్ బయట సర్క్యులేటింగ్ ఏరియాలో వేచి ఉండే ప్రయాణికులకు రైళ్ల రాకపోకల సమయాలు, ప్లాట్‌ఫారమ్ వివరాలు సరిగ్గా తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ సమస్యను నివారించేందుకు స్టేషన్ ఆవరణ బయట కూడా స్పీకర్లు ఏర్పాటు చేయాలని కోరారు.?ఈ వినతిపై సీనియర్ ఆఆఇ సానుకూలంగా స్పందించి. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, డివిజన్ పరిధిలోని ప్రధాన రైల్వే స్టేషన్ల సర్క్యులేటింగ్ ఏరియాల్లో పబ్లిక్ అనౌన్స్మెంట్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రయాణికుల సౌకర్యం కోసం వెంటనే స్పందించిన రైల్వే అధికారులకు అనుమాస శ్రీనివాస్ జీన్స్ ధన్యవాదాలు తెలిపారు.

# ఆర్టీసీ డిపోను సందర్శించిన టీజీఎస్ఆర్టీసీ ఈడీ సోలమన్, ఆర్ఎం రాజు

### ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లకు ఘన సన్మానం
### 'ప్రగతి చక్రం'పై ప్రత్యేక దిశానిర్దేశం
### డిపో ఆవరణలో మొక్కలు నాటిన అధికారులు



గోదావరిఖని: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) శ్రీ సోలమన్, కరీంనగర్ రీజినల్ మేనేజర్ (ఆర్ఎం) రాజు బుధవారం సాయంత్రం గోదావరిఖని ఆర్టీసీ డిపోను సందర్శించారు. డిపో మేనేజర్ శ్రీమతి కవిత పుష్పగుచ్ఛం అందజేసి అధికారులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిపోలో విధులు నిర్వహిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు డ్రైవర్లు, కండక్టర్లను అధికారులు శాలువాలతో ఘనంగా సత్కరించి, నగదు పురస్కారాలను అందజేశారు. సంస్థ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న ఉద్యోగుల సేవలను అధికారులు అభినందించారు. అనంతరం డిపో అధికారులు, సూపర్‌వైజర్లు, మెకానిక్‌లు, డ్రైవర్లు, కండక్టర్లు, కార్మికులతో సమావేశం నిర్వహించి 'ప్రగతి చక్రం' ద్వారా సంస్థను మరింత అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. డిపోలో బస్సుల వినియోగం, ఆదాయ వృద్ధి, ఖర్చుల నియంత్రణ, ప్రయాణికులకు మెరుగైన సేవలు, సిబ్బంది పనితీరు తదితర అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ప్రగతి చక్రంలో భాగంగా ప్రమాదాల నివారణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, డ్రైవర్లు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ ప్రమాద రహిత ప్రయాణానికి కృషి చేయాలని అధికారులు సూచించారు. బస్సులు మార్గమధ్యలో యాంత్రిక లోపాల కారణంగా నిలిచిపోకుండా ముందస్తు తనిఖీలు, తగిన నిర్వహణ చర్యలు చేపట్టాలని మెకానికల్ సిబ్బందికి సూచించారు. అలాగే ఆదాయాన్ని పెంచుతూ అనవసర ఖర్చులను నియంత్రించుకోవాలని, ప్రతి బస్సు మెరుగైన ఆక్యుపెన్సీతో నడిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణికులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా, సౌమ్యంగా వ్యవహరించి ఆర్టీసీపై నమ్మకాన్ని మరింత పెంచాలని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి సంస్థ ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. 'ప్రగతి చక్రం' లక్ష్యాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ గోదావరిఖని డిపోను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని ఈడీ సోలమన్, ఆర్ఎం రాజు సూచించారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సిబ్బంది కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ కవితతో పాటు అధికారులు, సూపర్‌వైజర్లు, మెకానిక్‌లు, డ్రైవర్లు, కండక్టర్లు, కార్మికులు, ఇతర డిపో సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తలకు దెబ్బ.. ప్రాణం మీదకు తెచ్చింది!

### 14 ఏళ్ల బాలుడికి అత్యవసర శస్త్రచికిత్స
### మృత్యువు అంచుల నుంచి బాలుడిని కాపాడిన యశోదా వైద్యులు



సూర్యాపేట రోడ్డు ప్రమాదంలో తలకు గాయమైనప్పుడు బయటకు గాయం కనిపించకపోయినా నిర్లక్ష్యం చేయొద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పుర్రె లోపల రక్తస్రావం జరిగి మెదడుపై ఒత్తిడి పెరిగితే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన 14 ఏళ్ల మల్లెబోయిన తేజ దురాజ్‌పల్లి సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయాడు. మూర్ఛ రావడంతో మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించగా.. పరీక్షల్లో పుర్రె లోపల భారీగా రక్తం పేరుకుపోయి మెదడుపై తీవ్ర ఒత్తిడి ఏర్పడినట్లు వైద్యులు గుర్తించారు. మెదడు సహజ స్థానంలో నుంచి పక్కకు జరిగినట్లు నిర్ధారించారు. పక్కటెముక విరగడంతో ఊపిరితిత్తి చుట్టూ గాలి చేరినట్లు గుర్తించారు. డా. శ్రీనివాస్ బొట్ల నేతృత్వంలోని వైద్యబృందం అత్యవసరంగా క్రానియోటమీ చేసి మెదడుపై ఒత్తిడి కలిగిస్తున్న రక్తాన్ని తొలగించింది. దెబ్బతిన్న పుర్రె ఎముకను టైటానియం ప్లేట్లు, స్క్రూలతో పునర్నిర్మించారు. ఊపిరితిత్తి సమస్యకు చికిత్సతో పాటు శ్వాసమార్గ నిర్వహణ కోసం ట్రాకియోస్టమీ చేశారు. న్యూరోసర్జరీ, క్రిటికల్ కేర్, కార్డియోథొరాసిక్, పీడియాట్రిక్స్ విభాగాల వైద్యులు సమన్వయంతో చికిత్స అందించి బాలుడి ప్రాణాలను కాపాడారు. ప్రతి నిమిషం కీలకంప్రమాదం తర్వాత స్పృహ కోల్పోవడం, మూర్ఛ, అసాధారణ మగత, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి తరలించాలని డా. శ్రీనివాస్ బొట్ల సూచించారు. సకాలంలో పరీక్షలు, అత్యవసర న్యూరోసర్జరీ అందితే శాశ్వత మెదడు నష్టాన్ని నివారించవచ్చని యశోదా మలక్‌పేట్ ఆసుపత్రి అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. శ్రీనివాస్ బొట్ల (న్యూరోసర్జన్), వాసుకిరణ్ రెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రకాష్ పాల్గొన్నారు.

## గోశాలకు రూ.40 వేల చెక్కు అందజేత

కరీంనగర్ గిరిజా గోశాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మృత్యుంజయ మహాదేవాలయం గోశాల నిర్వహణకు పశుసంవర్ధక శాఖ తరపున రూ.40 వేల పశుగ్రాసం చెక్కును అందజేశారు. పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నల్ల లింగారెడ్డి ఈ చెక్కును గోశాల నిర్వాహకులకు అందించారు. ఈ సందర్భంగా గోశాల నిర్వాహకులు మాట్లాడుతూ మూగజీవాల సంరక్షణకు ఆర్థిక సహాయం అందించిన పశుసంవర్ధక శాఖ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. నోరులేని జీవాలకు ఆహారం, నీరు, వైద్యం, ఆశ్రయం కల్పించడం గొప్ప మానవతా సేవ అని పేర్కొన్నారు. గోవులను, మూగజీవాలను సేవించడం భగవంతుని సృష్టిని సేవించడమే అని వారు అన్నారు. గోశాల నిర్వహణకు దాతలు, ప్రజలు తమవంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్జీవోల జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, గోశాల కార్యదర్శి చల్ల మోహన్ రెడ్డి, ఆర్థిక కార్యదర్శి సంఘ్యం లక్ష్మణరావు, గూడ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బీజేపీ నార్త్ జోన్ తిరంగా ర్యాలీ




కరీంనగర్ ఆగస్టు 13 హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా బీజేపీ నార్త్ జోన్ అధ్యక్షుడు పాదం శివరాజ్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎస్ఆర్ఆర్ కాలేజ్ నుంచి కోర్టు చౌరస్తా వరకు సాగిన ర్యాలీలో మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు జాతీయ జెండా పట్టుకుని పాల్గొన్నారు. విద్యార్థులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారత్ మాతా కీ జై వందేమాతరం నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కోర్టు చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీతారాంపూర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



కరీంనగర్ నగరపాలక సంస్థ 23వ డివిజన్ సీతారాంపూర్‌లో సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుధ్యం, తాగునీటి సౌకర్యాలు కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని మేయర్ తెలిపారు. అనంతరం 17, 18వ డివిజన్లలో అమృత్ 2.0 నిధులతో చేపట్టనున్న బ్లాక్ ప్లాంటేషన్ ఫెన్సింగ్ పనులను ప్రారంభించారు. నగరంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు మొక్కల సంరక్షణకు ఫెన్సింగ్ దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుమ్మడి రాజకుమార్, వేముల కవిత చంద్రశేఖర్, వాసాల రమేష్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

# సింగరేణి ఆర్జీ 3 ఓసీ1 వద్ద ఘనంగా డా. బి.జనక్ ప్రసాద్ 73వ జన్మదిన వేడుకలు

### ఐఎన్టీయూసీ కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్



కమాన్ పూర్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కనీస వేతన సలహా మండలి చైర్మన్ మరియు ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ డా. బి.జనక్ ప్రసాద్ 73వ జన్మదిన వేడుకలను సింగరేణి ఆర్జీత్రీ ఏరియా ఓసీ-1 గని ఆపరేషన్స్ సైట్ ఆఫీస్ నందు ఉద్యోగుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఐఎన్టీయూసీ కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్ గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం "లాంగ్ లివ్ జనక్ ప్రసాద్" అంటూ కార్మికులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తిరుపతి యాదవ్ గారు మాట్లాడుతూ... జనక్ ప్రసాద్ సింగరేణిలో క్లర్కుగా 35 సంవత్సరాలకు పైగా పనిచేస్తూనే కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశారని తెలిపారు. సింగరేణి శాశ్వత ఉద్యోగుల కోసమే కాకుండా కాంట్రాక్టు, ప్రైవేటు ఉద్యోగుల హక్కుల కోసం కూడా పోరాడుతున్నారని కొనియాడారు. గతంలో హైదరాబాద్ ప్రాంత పరిశ్రమల కార్మికులకు, 50 ఏళ్లకు పైగా సింగరేణి ఉద్యోగులకు వారు అందించిన సేవలను గుర్తించి, తెలంగాణ ప్రభుత్వం వారిని కనీస వేతన సలహా మండలి చైర్మన్‌గా నియమించడం వారి అనుభవానికి, కృషికి లభించిన గుర్తింపు అని పేర్కొన్నారు. నిరంతరం కార్మికుల శ్రేయస్సు కోసం పనిచేస్తున్న జనక్ ప్రసాద్ ఆయురారోగ్యాలతో ఉండి, ఇదే విధంగా కార్మికులకు సేవ చేయాలని దేవుణ్ణి ప్రార్థించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గని ఐఎన్టీయూసీ పిట్ కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి, నాయకులు మోతుకూరి సాంబయ్య, మామిడి సాంబయ్య, అడపాల రామకృష్ణ, బోడకుంట రాజయ్య, గుండేటి నాగరాజు, సారయ్య, సాదుల శంకర్, బ్లాస్టింగ్ సెక్షన్ ఉద్యోగులు, మహిళ ఉద్యోగులు పి.అరుణ, వి.రజిత, కే.అనిత, కే.మమత, ప్రైవేట్ ఉద్యోగులు తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

కరీంనగర్: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్‌లో హరితహారం పథకం కింద మొక్కలు నాటేందుకు ఏర్పాటు చేస్తున్న ప్రదేశంలో ఫెన్సింగ్ పనులకు కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో 18వ డివిజన్ కార్పొరేటర్ వాసాల రమేష్, 17వ డివిజన్ కార్పొరేటర్ వేముల కవిత చంద్రశేఖర్, కార్పొరేటర్ బండ రమణారెడ్డి పాల్గొన్నారు. అనంతరం కొత్తపల్లి రైల్వే స్టేషన్‌ను మేయర్, కార్పొరేటర్లు సందర్శించి స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి, సిగ్నలింగ్ వ్యవస్థకు సంబంధించిన పనులను పరిశీలించారు. సిగ్నలింగ్ వ్యవస్థను మెరుగుపరుస్తూ, స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టి త్వరలో స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకురానున్న నేపథ్యంలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరంపై చర్చించారు. పుష్పుల్ రైలు హాల్టింగ్ ను పునరుద్ధరించాలిగతంలో కొత్తపల్లి రైల్వే స్టేషన్‌లో పుష్పుల్ ప్యాసింజర్ రైలుకు హాల్టింగ్ సౌకర్యం ఉండేదని, సిగ్నలింగ్ వ్యవస్థీకరణతో పాటు స్టేషన్ మరమ్మతుల కారణంగా ప్రస్తుతం హాల్టింగ్ లేకుండా పోయిందని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం స్టేషన్‌లో సిగ్నలింగ్ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు మరమ్మతులు పూర్తిచేసి స్టేషన్‌ను. పునరుద్ధరిస్తున్నందున, ఇకనైనా పుష్పుల్ ప్యాసింజర్ రైలుకు కొత్తపల్లి స్టేషన్‌లో హాల్టింగ్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా రైల్వే స్టేషన్‌కు ఇరువైపులా తుమ్మ చెట్లు పెరిగి కొత్తపల్లి స్టేషన్ మార్గానికి అడ్డుగా ఉంటున్నాయని గుర్తించారు. ఈ చెట్ల వల్ల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున వెంటనే వాటిని తొలగించాలని సంబంధిత అధికారులకు, స్టేషన్ మాస్టర్‌కు సూచించారు. కొత్తపల్లి రైల్వే స్టేషన్‌కు హాల్టింగ్ సౌకర్యాలు పెంచడం ద్వారా స్థానిక ప్రజలకు, ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఈ విషయంలో రైల్వే ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో స్వర్గం నరసయ్య, ముత్తునూరి హరీష్, చిట్కూరి శ్రీనివాస్, కేంచ శేఖర్, మెరుగు మల్లేశం, కోటగిరి శ్రీనివాస్, వీరేశం, శ్రీకాంత్ పరం, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు

# ఓటు హక్కు డిజిటలైజేషన్ వివరాలు



**గండిపేట మండల ప్రజాబలం ప్రతినిధి 13 ఆగస్టు 2026**భారత ఎన్నికల సంఘం నిర్ణయం మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతికి లోబడి చట్టబద్దతగా ఓటు హక్కు డిజిటలైజేషన్ ప్రక్రియను మొదలు పెట్టిన దరిమిలా తెలంగాణ రాష్ట్రంలో 35985 పోలింగ్ సెంటర్లు ఉండగా 92 సెంటర్లలో కొన్నింటిని రద్దు చేయడం, కొన్నింటిని విలీనం చేయడం తదనంతరం 460 పోలింగ్ సెంటర్లను క్రొత్తగా ఏర్పాటు చేసిన సందర్భముగా ప్రస్తుతం 36353 పోలింగ్ సెంటర్లు ఏర్పడ్డవని ఎన్నికల సంఘం అధికారుల ద్వారా సమాచారం తెలిసినది. మణికొండలో 33423 ఓటరులు ఉండగా 53.33 శాతం ప్రకారం 17826 మంది ఓటరులు నమోదుకు సహకరించారని, పుప్పలగూడలో 29289 ఓటరులు ఉండగా 53.39 శాతం ప్రకారం 15640 మంది ఓటరులు నమోదుకు సహకరించారని, నెక్నంపూర్ లో 9142 ఓటరులు ఉండగా 61.8 శాతం ప్రకారం 5650 మంది ఓటరులు నమోదుకు సహకరించారని భారత రాష్ట్ర సమితి స్థానిక నాయకుడు అందే లక్ష్మణ్ రావు తెలిపారు.


# మున్సిపల్ కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలి



**జహీరాబాద్, ఆగస్టు 13 ప్రజాబలం ప్రతినిధి:** మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మే నెల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మహిపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రతినెల 7వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని కోరారు. ట్రెజరీలో నిధులు నిలిచిపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే జీతాలు విడుదల చేయకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. స్పందించిన కమిషనర్ సాంకేతిక సమస్యలను పరిష్కరించి, అవసరమైతే జనరల్ ఫండ్ నుంచి వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యశోదమ్మ, మోహన్, సందీప్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# శశికిరణ్ కొమాండూర్ 'శ్రీమద్రామాయణం'కు తెలుగు వర్సిటీ సాహితీ పురస్కారం






హైదరాబాద్ 13, ఆగస్టు2026: ప్రముఖ కవి, తెలంగాణ గవర్నర్ జాయింట్ సెక్రటరీ, సీనియర్ గ్రూప్–1 అధికారి శశికిరణ్ కొమాండూర్ రచించిన పద్య మహాకావ్యం 'శ్రీమద్రామాయణం' 2024 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మక సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారానికి ఎంపికైంది.

పరిపాలనా విధులు నిర్వహిస్తూనే రెండు దశాబ్దాలుగా సాహిత్య సాధన కొనసాగిస్తున్న శశికిరణ్.. సామాన్య పాఠకుడికీ సులభంగా అర్థమయ్యే వాడుకభాషలో, ఛందోబద్ధంగా 'శ్రీమద్రామాయణం'ను రచించారు.

ప్రముఖ ప్రచురణ సంస్థ ఎమెస్కో ఈ మహాకావ్యాన్ని ప్రచురించింది.

సాహితీవేత్తగానే కాకుండా, వ్యక్తిగత జీవితంలో అత్యున్నత నైతిక విలువలు, నిజాయితీ కలిగిన అధికారిగా శశికిరణ్ గారికి గొప్ప పేరుంది. గతంలో భారత ప్రభుత్వ కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారానికి పరిశీలించినప్పటికీ ఆయన దానిని సున్నితంగా తిరస్కరించారు. ఆ సమయంలో ఆయన సంబంధిత కేంద్ర మంత్రి వద్ద విధులు నిర్వర్తిస్తుండటంతో.. ఏ చిన్న విమర్శకు తావివ్వకూడదన్న ఉద్దేశ్యంతో, పదవిలో ఉన్నప్పుడు తన శాఖ నుంచి అవార్డు తీసుకోవడం నైతికం కాదని ఆ అవకాశాన్ని వదులుకున్నారు.

నైతిక విలువలకు ప్రాధాన్యమిస్తూ తనదైన సాహిత్య ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న శశికిరణ్‌కు ఈ పురస్కారం లభించడం పట్ల కవులు, రచయితలు, ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

శశికిరణ్ కొమాండూర్ కు గ్రూప్ -1 అధికారుల సంఘం అధ్యక్షులు , లోక్ భవన్ అధికారుల సత్కారం

తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారానికి ఎంపికైన శశికిరణ్ కొమాండూర్ ను గ్రూప్ -1 అధికారుల సంఘం అధ్యక్షులు మామిండ్ల చంద్ర శేఖర్ గౌడ్ , గవర్నర్ ఉప కార్యదర్శి జి పల్లవి,ప్రెస్ సెక్రటరీ మామిండ్ల దశరథం, సమన్వయ అధికారి మరళీ చార్యులు , అకౌంట్ ఆఫీసర్ శైలజ ,



అసిస్టెంట్ కంప్ట్రోలర్ జెడ్ హెరాల్డ్ డేవిడ్,ఉద్యానవన అధికారిణి మాలిని, , డి ఈ ఈ శ్రీధర్, సెక్షన్ ఆఫీసర్ ఎస్ రామచంద్రం, సాంఖ్యక అధికారి శ్రీకాంత్

ఏ ఈ ఈ లు హర్ష వర్ధన్, త్రిష లులోక్ భవన్ లో సత్కరించారు.

లోక్ భవన్ ఉద్యోగులు సిబ్బంది ప్రత్యేకంగా శశికిరణ్ కొమాండూర్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# పాఠశాల పరిశుభ్రతపై కమిషనర్ తనిఖీ



**జహీరాబాద్, ఆగస్టు 13 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ మండలం హోతి–కేలోని టీజీ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజీని జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి. ప్రభాకర్ గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు పాఠశాల, కళాశాల ప్రాంగణాల్లో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. క్యాంపస్‌లోని పరిసరాలు, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించిన కమిషనర్.. పాఠశాల, కళాశాల ఆవరణలో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులు, సిబ్బందికి పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా పారిశుద్ధ్య నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

# ఆందోల్ మండల్ లోపోసానిపేట, శివారులో అక్రమ వెంచర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 13 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా** :పోసానిపేట శివారులోని సర్వే నంబర్ (255,)లో నిబంధనలకు విరుద్ధంగా వెంచర్ ఏర్పాటుచేసి,ఎలాంటి అనుమతులు లేకుండా ప్లాట్లనువిక్రయిస్తున్నారంటూ, అందోల్ – జోగిపేట, మున్సిపాలిటీ వైస్ చైర్మన్, ఆకుల చిట్టిబాబు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు,ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, సదరు భూమిలో సరైన లే అవుట్ అనుమతులు లేకుండానే ప్లాట్లు, ఏర్పాటు చేసి విక్రయాలు జరిపినట్లు ఆరోపించారు,వెంచర్‌లో రోడ్లు,పార్కులు, డ్రైనేజీ, వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయలేదని, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు కూడా లేవని ఫిర్యాదుదారులుపేర్కొన్నారు.అదేవిధంగా 2, ఎకరాల 26,గుంటలుగా దరఖాస్తులో పేర్కొనగా, ఆన్‌లైన్ రికార్డుల్లో మాత్రం 2.2150గా నమోదై ఉందని, ఈ వ్యత్యాసంపై కూడా అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని కోరారు.అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలను పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, అక్రమంగా వెలసిన వెంచర్‌పై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ మేరకు జిల్లా కలెక్టర్, (డిఆర్‌ఓ ) (డీపీవో )తో పాటు స్థానిక (ఎమ్మార్వో )కు ఫిర్యాదు చేసి, అక్రమ వెంచర్ మరియు అనుమతులు లేని నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు

# జహీరాబాద్ ఏరియా ఆసుపత్రిలో సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**జహీరాబాద్, ఆగస్టు 13 ప్రజాబలం ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ ఏరియా ఆసుపత్రిని సబ్ కలెక్టర్ ఉమా హారతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ వార్డులను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రోగులకు అందుతున్న చికిత్స, ఆసుపత్రిలోని సౌకర్యాలపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్మాణం పూర్తయిన మాతా శిశు ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని సబ్ కలెక్టర్ పరిశీలించారు. త్వరలో జరగనున్న భవన ప్రారంభోత్సవ ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో పనిచేసే ప్రతి ఒక్కరూ విధిగా సమయపాలన పాటించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ దశరథ్, తదితరులు ఉన్నారు.

# చెరకు రైతులకు శాస్త్రీయ సాగుపై అవగాహన




**జహీరాబాద్, ఆగస్టు 13 ప్రజాబలం ప్రతినిధి:** రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ అధికారులు సూచించారు. మొగుడంపల్లి మండలంలోని గుడ్పల్లి రైతు వేదికలో చెరకు పంట యాజమాన్యం, నానో ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

వ్యవసాయ పరిశోధన స్థానం, బసంత్‌పూర్ శాస్త్రవేత్త విజయలక్ష్మి పాల్గొని చెరకు పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఎరువుల యాజమాన్యం, కలుపు నివారణ, పురుగుమందుల వినియోగం, ఇతర శాస్త్రీయ పద్ధతులను వివరించారు.సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) బి. బిక్షపతి నానో ఎరువుల వినియోగం, వాటి ప్రయోజనాలు, సరైన వినియోగ విధానాలను వివరించారు. కంది పంటలో ఎండు తెగులు నివారణ, యాజమాన్య పద్ధతులతో పాటు ఇతర పంటల్లో చేపట్టాల్సిన చర్యలను తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అస్నుద్దిన్ ,గుడ్పల్లి సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, గౌసాబాద్ సర్పంచ్ నందు, గౌసాబాద్ తండా సర్పంచ్ నారాయణ, ఔరంగ్‌నగర్ ఉప సర్పంచ్ శేఖర్, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రదీప్ కుమార్, శ్రీనివాస్, ఖనీజ్, ఆత్మ బీటీఎం చరణ్, రైతులు గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌రామ్‌రెడ్డి, సిద్దారెడ్డి, రాజేందర్‌రెడ్డి, సాయి చరణ్, భాస్కర్, మారుతి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



## జగద్గిరిగుట్ట లో భారీగా తిరంగా ర్యాలీ

మేడ్చల్ ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని బిజెపి మేడ్చల్ జిల్లా ఓబీసీ అధ్యక్షుడు నేత శేఖర్ యాదవ్ అన్నారు. గురువారం జగద్గిరిగుట్ట లోనీ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులతో కలిసి భారీగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటుకునే విధంగా ఇంటిపైన జెండా తప్పనిసరిగా ఎగరవేయాలని సూచించారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకే ప్రతి కాలనీలో ఈ తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు. ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం అని మాత్రమే పిల్లలకి తెలుస్తుందని ఈ బానిస సంకెళ్లు తెంచుకొని స్వతంత్రం దేశంగా ఎదిగి ఊపిరి పీల్చుకున్న విధానాన్ని వారికి అర్థమయ్యేలా ప్రతి ఒక్కరు చెప్పాల్సిన బాధ్యత ఉందని వారు అన్నారు.

## గణేష్ మండపాల వద్ద విద్యుత్ భద్రతపై దృష్టి పెట్టాలి




**జహీరాబాద్, ఆగస్టు 13 ప్రజాబలం ప్రతినిధి:** వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో పట్టణంలోని గణేష్ మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని 27వ వార్డు కౌన్సిలర్ నామ స్రవంతి కోరారు. ఈ మేరకు విద్యుత్ శాఖ డీఈఈ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. మండపాల వద్ద అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ వైర్లు, కేబుళ్లను సరిచేసి సురక్షితమైన ఇన్సులేటెడ్ కేబుళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యంగా భవాని మందిర్ రోడ్డులోని రాచన్నపేట్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే మండపం వద్ద విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా దగ్గరగా ఉన్నాయని తెలిపారు. ఉత్సవాలు ప్రారంభమయ్యేలోపు ఆయా ప్రాంతాల్లో వైరింగ్, కేబుళ్లను పరిశీలించి అవసరమైన మరమ్మతులు, మార్పులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నామ రవికిరణ్, నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## బాధ్యతతో కూడిన నాయకత్వమే నిజమైన నాయకత్వం.



**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 13 ఆగస్టు 2026**మణికొండ తానిషా నగర్ హుడా కాలనీ లోని లోటస్ స్కూల్లో గురువారం రోజున విద్యార్థుల ఇన్వెస్టిచర్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యత, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించే సందేశాన్ని అందిస్తూ, విద్యార్థుల స్కూల్ క్యాబినెట్‌కు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించడం ద్వారా నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులను గుర్తించిన పాఠశాల చైర్మన్ రవి కుమార్, సీతారాం ధూళిపాళ, సీతారామ్ దాస్, కృష్ణ కుమార్ విద్యార్థులకు బ్యాడ్జీలు, పాఠశాల జెండాలను సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీతారాం ధూళిపాళ నాయకత్వంపై కీలక ప్రసంగం చేశారు. నాయకత్వం అంటే కేవలం ఒక పదవిని చేపట్టడం కాదని, సమస్యలను అర్థం చేసుకుని వాటికి ఆచరణాత్మకమైన పరిష్కారాలను చూపించడం, ఇతరులను కలుపుకుని ముందుకు సాగడం అని విద్యార్థులకు సూచించారు. ఇట్టి ఇన్వెస్టిచర్ కార్యక్రమం నిర్వహించడం పట్ల ఆయన పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు మరియు ఎన్నుకోబడ్డ విద్యార్థి నాయకులు బాధ్యతా యుతంగా వ్యవహరించాలని, ఇతరులను గౌరవించాలని, సమిష్టిగా పనిచేయాలని, విద్యార్థుల సంక్షేమానికి ఉపయోగించాలని ఆయన సూచించారు. నేటి విద్యార్థి నాయకులే రేపటి బాధ్యతాయుతమైన పౌరులు, నాయకులు అని ఆయన పేర్కొన్నారు.

## 18 వార్డ్ లో నూతన బోరు బావి మంజూరు

**. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా**

**18వ వార్డు కౌన్సిలర్ మెరుగు మంజుల - శ్రీనివాస్**

**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఆగస్టు 13,( ప్రజాబలం ప్రతినిధి )**సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూ నగర్ లో నూతన బోర్ బావికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వార్డ్ కౌన్సిలర్ మెరుగు మంజుల - శ్రీనివాస్ మాట్లాడుతూ .. 18 వార్డులో ఉన్న సమస్యలను, నీటి సమస్యలను గురించి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ఎంపీ బండి సంజయ్ కుమార్ దృష్టికి తీసుక వెళ్లగా మంత్రి స్పందించి ఎంపీ ల్యాడ్స్ నిధుల నుండి బోరు బావి మంజూరు చేశారు. వార్డు ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటూ వారికి ఏ





సమస్యలు వచ్చిన ముందుండి పరిష్కరిస్తానని.

వార్డులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు చేస్తున్నట్టు తెలిపారు . ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు దూమల శ్రీకాంత్ , పట్టణ ప్రధాన కార్యదర్శి సూరం వినయ్, సీనియర్ నాయకుడు రాజు , ఎర్రం విజయ్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### ప్రతిభను అవమానించడం తగదు

### బద్వేలు టిడిపి ఇన్చార్జి సూర్యనారాయణ రెడ్డి

బద్వేలు ప్రతిభ ఆధారంగా 2025- డీఎస్సీ. లో నియమితులైన ఉపాధ్యాయులపై జరుగుతున్న అసత్య ఆరోపణలను, దాని వెనుక ఉన్న రాజకీయ కుట్రలను తిప్పికొట్టాలని బద్వేలు టిడిపి ఇంచార్జ్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. నిజాన్ని ప్రజలకు వివరించేందుకు పోరాడుతున్న డీఎస్సీ ఉపాధ్యాయులకు ప్రజాస్వామ్యవాదులు అండగా నిలవాలని కోరారు. గురువారం బద్వేలు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన పత్రిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ పోటీ పరీక్షల్లో ప్రతిభ ఆధారంగా ఎంపికై ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన వారిని కావాలనే అవమానించేలా కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి చదివి, పోటీ పరీక్షల్లో ప్రతిభను నిరూపించుకుని ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిపై నిందారోపణలు చేయడం, వారి ప్రతిభను ప్రశ్నించడం సమంజసం కాదన్నారు. కేవలం 230 రోజుల్లోనే 180కి పైగా న్యాయపరమైన కేసులను ఎదుర్కొని, మెగా డీఎస్సీ?2025 ద్వారా 16,376 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.

## సింగరేణి లో సురక్షక తిరంగా సైబర్ అవేర్నెస్



**పెద్దపల్లి/గోదావరిఖని, ఆగస్టు-13, ప్రజాబలం ప్రతినిధి:** సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో సైబర్ క్రైమ్ సబ్ ఇన్స్పెక్టర్ మారుతి ఆధ్వర్యంలో గురువారం జిడికె 2ఐ 2ఏ ఇంక్లైన్ జిడికె 2 సెక్షన్ నందు సురక్షక తిరంగా సైబర్ అవేర్నెస్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మారుతి సైబర్ క్రైమ్ అవేర్నెస్ లో సైబర్ క్రైమ్ గురించి తెలియజేశారు. అలాగే మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పారు. సైబర్ క్రైమ్ జరిగినప్పుడు తప్పనిసరిగా 1930 కి కాల్ చేసి తమ యొక్క ఫిర్యాదును నమోదు చేసుకోవాలని కోరారు. దానితో మరొక సైబర్ క్రైమ్ జరగకుండా అడ్డుకట్ట వెయ్యవచ్చు అని అలాగే ఒకవేళ సైబర్ క్రైమ్ వల్ల మీ యొక్క లావాదేవీలు ప్రరంమైన ఇబ్బందులు ఎదురైతే వాటిని వీలైనంత త్వరగా తెలియజేసినట్లు అయితే ఎకౌంట్ ఫ్రిజ్ చేయడానికి ఆస్కారం ఉంటుందని లేనియెడల ఆలస్యం అయినచో డబ్బులు రికవరీ చేయడం కష్టమవుతుందని తెలియజేశారు. అలాగే వాట్సాప్ లో నేను పోలీసులమని బెదిరింపు కాల్స్ వస్తే భయపడకుండా అలాంటి కాల్స్ నీ కట్ చేసి మీకు దగ్గరలో ఉన్న సైబర్ క్రైమ్ టీమ్ కి తెలియజేసినట్లు అయితే నేరాలన్నీ అదుపులోకి తీసుకురావచ్చును తెలియజేయడం జరిగింది. అలాగే తెలియని కాల్స్ తెలియని ఆప్స్ ఏపీకే ఫైల్స్ వస్తే వాటిని ఓపెన్ చేయకుండా వాటిని వెంటనే డిలీట్ చేయాలని సూచించారు. మీ యొక్క ఫోన్ కి ఏవైనా లింక్స్ వస్తే వాటికి ఎట్టి పరిస్థితుల్లో ఓటిపి ఎంటర్ చేయొద్దు అని, అలాగే మీ యొక్క ఓటీపీలు బ్యాంక్ యొక్క వివరాలు పాన్ ఆధార్ వివరాలు మరియు మీ యొక్క వ్యక్తిగత విషయాలని ఇతరులకి షేర్ చేసుకోవద్దని చెప్పడం జరిగింది. పెట్టుబడికి సంబంధించిన మోసాల గురించి కూడా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ ఇజ్జగిరి శివయ్య, డి గణేష్ వెల్ఫేర్ ఆఫీసర్, సల్మాన్ ఖాన్ సెక్షన్ ఇంచార్జ్,జి. కుమారస్వామి వెంటిలేషన్ ఆఫీసర, గని అధికారులు, పొన్నాల వెంకటయ్య పిట్ సెక్రటరీ, సూపర్వైజర్లు, మహిళా ఉద్యోగులు మరియు ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు అకడమిక్ సహకారం అందించాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, ఆగస్టు-13, ప్రజాబలం ప్రతినిధి:** అకడమిక్ ప్యానల్ సందర్శనలు కేవలం తనిఖీలకే పరిమితం కాకుండా ఉపాధ్యాయులకు అవసరమైన అకడమిక్ సహకారం అందిస్తూ, పాఠశాలల్లో నిరంతర విద్యా అభివృద్ధికి దోహదపడేలా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. తరగతి గది బోధనా పద్ధతులను బలోపేతం చేయడం, విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడం అకడమిక్ మానిటరింగ్ ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు. గురువారం ఉస్మానియా యూనివర్సిటీలో రాష్ట్రంలోని అన్ని మండల విద్యాధికారులు, జిల్లా విద్యాధికారులు, ప్రాంతీయ సంయుక్త సంచాలకుల కోసం నిర్వహించిన ఒకరోజు శిక్షణ, అవగాహన కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లాలో అమలు చేస్తున్న అకడమిక్ ప్యానల్ విధానంపై రాష్ట్రస్థాయి అధికారులకు ప్రజెంటేషన్ ఇచ్చారు. పెద్దపల్లి జిల్లాలో అకడమిక్ ప్యానల్ ద్వారా పాఠశాలలను క్రమబద్ధంగా సందర్శిస్తూ, పాఠశాల స్థాయిలో బోధన--అభ్యసన ప్రక్రియను పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు. ప్రతి పాఠశాల సందర్శనలో తరగతి గది పరిశీలన, విద్యార్థుల స్పాట్ అసెస్‌మెంట్ తప్పనిసరిగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థుల అభ్యసన స్థాయిని ప్రత్యక్షంగా అంచనా వేసి, అభ్యసనలో వెనుకబడిన అంశాలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన జోక్యాలను ప్రణాళిక చేస్తున్నట్లు వివరించారు. విద్యార్థుల అభ్యసన డేటాను ఆధారంగా చేసుకుని బోధనా ప్రణాళికలను మరింత ప్రభావవంతంగా రూపొందించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన మండల విద్యాధికారులు, జిల్లా విద్యాధికారులు, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, క్వాలిటీ కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ధైర్యసాహసాలు.. బాలిక ప్రాణాలు కాపాడిన యువకులకు సన్మానం

### గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ అభినందనలు

**పెద్దపల్లి, ఆగస్టు-13, ప్రజాబలం ప్రతినిధి:**



బొక్కలవాగులో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోతున్న బాలికను ధైర్యసాహసాలతో రక్షించిన బోయినిపేటకు చెందిన అంకం శేఖర్, ఆకుల అరవింద్‌లను గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ తన కార్యాలయంలో అభినందించి సన్మానించారు. మంథని పోలీస్ స్టేషన్ పరిధిలోని బొక్కలవాగు వద్ద బోయినిపేటకు చెందిన పర్శవేన రాజు తన కుమార్తె అలేఖ్యతో కలిసి గొర్రెల మందను వాగు దాటించే ప్రయత్నం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో జారిపడ్డాడు. తండ్రిని కాపాడేందుకు ప్రయత్నించిన అలేఖ్య కూడా నీటిలో మునిగిపోతూ కేకలు వేసింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న అంకం శేఖర్ వెంటనే స్పందించి నీటిలోకి దిగి అలేఖ్యను సురక్షితంగా బయటకు తీసుకొచ్చాడు. అప్పటికే ఆమె స్పృహ కోల్పోవడంతో శేఖర్, ఆకుల అరవింద్ కలిసి ప్రథమ చికిత్స అందించి ఆమెను స్పృహలోకి తీసుకువచ్చారు. అనంతరం అలేఖ్య తన తండ్రి కూడా నీటిలో మునిగిపోయినట్లు చెప్పడంతో ఇద్దరూ వాగులోకి దిగి రాజును బయటకు తీసుకొచ్చి ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే రాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆపద సమయంలో ప్రాణాలకు తెగించి బాలికను కాపాడటంతో పాటు ఆమె తండ్రిని రక్షించేందుకు ప్రయత్నించిన శేఖర్, అరవింద్‌ల ధైర్యసాహసాలను ఏసీపీ ఎం.రమేష్ అభినందించారు. ఏసీపీ కార్యాలయంలో మంథని సీఐ బుద్ధె స్వామి, ఎస్ఐ సాగర్‌ల సమక్షంలో వారిని శాలువాలతో సత్కరించి, ఆపదలో మానవత్వంతో స్పందించినందుకు అభినందనలు తెలిపారు. ఆపదలో ఉన్నవారిని రక్షించేందుకు సమయస్ఫూర్తితో స్పందించడం అభినందనీయమని, వారి ధైర్యసాహసాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని ఏసీపీ పేర్కొన్నారు.

### అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో మంత్రి సవిత సమీక్ష

పెనుకొండ క్యాంపు కార్యాలయంలో రొద్దం మండల ముఖ్య నాయకులు, మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించాను.. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలు, త్వరలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని సత్వరమే పరిష్కరించాలని సూచించాను. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఆదేశించాను..మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని తెలిపాను.

# మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ సంకల్పం

## రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మంత్రి సీతక్క






**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 13** ములుగు

మహిళా శక్తిని వ్యాపార శక్తిగా మార్చడమే లక్ష్యం

స్వయం సహాయక సంఘాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

మహిళలు ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి

ములుగు పర్యాటక సంపద మహిళల ఆర్థికాభివృద్ధికి అవకాశాల గని

మహిళా వ్యాపారాలకు కొత్త దిశగా 'ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్'

గురువారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గ్రామీణాభివృద్ధి శాఖ, సెర్ప్ తెలంగాణ ఆధ్వర్యంలో బిట్స్ పిలానీ హైదరాబాద్ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ సహకారంతో నిర్వహించిన జిల్లా స్థాయి ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్ అవగాహన, ప్రణాళిక కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాపారాలను గుర్తించి, వాటిని మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, వ్యాపార నిర్వహణ, మార్కెటింగ్, ఆర్థిక సహకారం అందించాలని ప్రధాన ఉద్దేశంతో, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 300 మహిళా ఆధారిత వ్యాపారాలను గుర్తించి, వాటి సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా మహిళలను విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అర్హత కలిగిన మహిళా వ్యాపారవేత్తలకు వ్యాపార విస్తరణ, మార్కెటింగ్, యంత్రాలు, పరికరాలు, ముడిసరుకు తదితర అవసరాల కోసం రూ.లక్ష నుంచి రూ.15 లక్షల వరకు గ్రాంట్ పొందే అవకాశం తో గ్రామీణాభివృద్ధి శాఖ, సెర్ప్ తెలంగాణ ఆధ్వర్యంలో బిట్స్ పిలానీ హైదరాబాద్ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ సహకారంతో నిర్వహించిన జిల్లా స్థాయి ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్ ద్వారా ప్రత్యేక శిక్షణ, మార్గదర్శకత్వం అందించనున్నారు.

ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతమైతే కుటుంబం బాగుపడుతుందని, కుటుంబాలు బాగుంటే సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మహిళల సామర్థ్యంపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి అపారమైన నమ్మకం ఉందని, అందుకే మహిళా సంఘాలకు వివిధ వ్యాపార, ఉపాధి అవకాశాలను కల్పిస్తూ వారిని పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. వడ్డీలేని రుణ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడంతో పాటు మహిళా సంఘాలు తీసుకున్న రుణాలపై వడ్డీని ప్రభుత్వం క్రమం తప్పకుండా చెల్లిస్తోందని, ములుగు జిల్లాలో ఇప్పటివరకు సుమారు రూ.13 కోట్ల వడ్డీ మొత్తాన్ని మహిళలకు తిరిగి చెల్లించినట్లు వెల్లడించారు.

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు మండల సమాఖ్యలకు బస్సులను అందించి ఆదాయ మార్గాలను సృష్టిస్తున్నామని మంత్రి తెలిపారు. అర్హత కలిగిన ఒంటరి, వితంతు మహిళలకు పింఛన్లు అందించే కార్యక్రమాన్ని ఆగస్టు 16వ తేదీన శ్రీ సమ్మక్క--సారలమ్మ సన్నిధి నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. అర్హులైన వారిని గుర్తించి ఆగస్టు 31వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పింఛన్లు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజల కోసం పోరాడి వనదేవతలుగా కొలువుదీరిన సమ్మక్క--సారలమ్మ మహిళలందరికీ గొప్ప స్ఫూర్తి అని పేర్కొన్నారు.

మహిళలు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా సొంత వ్యాపారాలను ఏర్పాటు చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని, తద్వారా మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. బిట్స్ పిలానీ సహకారంతో అందించే శిక్షణను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి మండలం నుంచి వ్యాపారం పట్ల ఆసక్తి, వినూత్న ఆలోచనలు కలిగిన మహిళలను గుర్తించి శిక్షణకు ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. చిన్న వ్యాపారంతో ప్రారంభించి సరైన శిక్షణ, మార్కెటింగ్ సదుపాయాలను అందిపుచ్చుకుంటే మహిళలు విజయవంతమైన వ్యాపారవేత్తలుగా ఎదగవచ్చని అన్నారు.

ములుగు జిల్లాలోని అపారమైన ప్రకృతి, పర్యాటక సంపదను మహిళల ఆర్థికాభివృద్ధికి అనుసంధానం చేయాలని మంత్రి సూచించారు. మేడారం శ్రీ సమ్మక్క--సారలమ్మ, రామప్ప దేవాలయం, లక్నవరం సరస్సు, బొగత జలపాతం, గోదావరి తీరం, దట్టమైన అడవులతో జిల్లా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో క్యాంటీన్లు, మొబైల్ టిఫిన్ కేంద్రాలు, స్థానిక ఆహార ఉత్పత్తుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానికంగా లభించే ఇప్పపువ్వు, అరటి, మిరప తదితర ఉత్పత్తులకు విలువ జోడించి ప్యాకేజింగ్, మార్కెటింగ్ చేయడం ద్వారా మహిళలకు స్థిరమైన ఆదాయం సమకూరుతుందని తెలిపారు.

మహిళా సంఘాల విజయగాథలు ఇతర మహిళలకు స్ఫూర్తినిచ్చేలా ప్రత్యేక మాసపత్రికను రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. చిన్న స్థాయి నుంచి వ్యాపారవేత్తలుగా ఎదిగిన మహిళలు చేపట్టిన వ్యాపారాలు, సాధించిన విజయాలను అందులో ప్రచురిస్తామని చెప్పారు. గ్రామ, మండల స్థాయిలో విజయవంతమైన మహిళా వ్యాపారవేత్తలను గుర్తించి వారి విజయగాథలను సెర్ప్‌కు పంపించాలని, ఫొటోలు, కథనాలు, వీడియోల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు చేరవేయాలని అధికారులకు సూచించారు.

ములుగు జిల్లా భవిష్యత్తులో ప్రధాన పర్యాటక, విద్యా, వైద్య కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుందని మంత్రి పేర్కొన్నారు. నూతన కలెక్టరేట్, మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, సమ్మక్క--సారక్క కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం, యంగ్ ఇండియా సమీకృత గురుకుల విద్యాలయం వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలతో జిల్లాలో వ్యాపార అవకాశాలు మరింత విస్తరిస్తాయని తెలిపారు. ఈ అవకాశాలను మహిళా సంఘాలు అందిపుచ్చుకునేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సుమారు రూ.1 కోటి 50 లక్షల తో ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంక్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా వ్యాపారవేత్తలుగా, మరికొందరికి ఉపాధి కల్పించే శక్తిగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, డీఆర్డీఓ రవీందర్, బిట్స్ పిలానీ ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్ ప్రాజెక్ట్ మేనేజర్ నవీన్ కృష్ణ,జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, ములుగు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్,ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె. అనూష, డీపీఎంలు, ఏపీఎంలు, సీఏలు, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు మేడారం ముస్తాబు.

**ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలి.**

**మేడారం ఆలయ తుది దశ అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి.**

**సమ్మక్క--సారలమ్మ సన్నిధి నుంచి ఒంటరి, వితంతు మహిళల పింఛన్లకు శ్రీకారం.**

**మంత్రి దనసరి అనసూయ సీతక్క.**





**ప్రజాబలం ప్రతినిధి ములుగు జిల్లా ఆగస్టు 13:** ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మేడారం ప్రాంతాన్ని ముస్తాబు చేయాలని, ఘన స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, సమ్మక్క--సారలమ్మ సన్నిధి నుంచి ఒంటరి, వితంతు మహిళల పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు.

గురువారం ఎస్ ఎస్ తాడ్వాయి మండలం లోని మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతల సన్నిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో లెనిన్ వస్తల్ టోప్పో లతో కలిసి పరిశీలించారు

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇప్పటికే రెండుసార్లు మేడారం ప్రాంగణానికి వచ్చి శ్రీ సమ్మక్క--సారలమ్మ ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపారని తెలిపారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన నిధులను సమకూర్చి పనులకు శ్రీకారం చుట్టడంతో పాటు మహాజాతరకు ముందు కుటుంబ సమేతంగా వనదేవతలను దర్శించుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రివర్గ సహచరులతో కలిసి మేడారంలో బస చేసి, ములుగు జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించారని తెలిపారు.

ఈ నెల 16వ తేదీన ముఖ్యమంత్రి మరోసారి మేడారానికి వస్తున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. ముఖ్యమంత్రి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి, భవిష్యత్తులో చేపట్టాల్సిన విస్తరణ, అభివృద్ధి పనులపై సూచనలు, సలహాలు, ఆదేశాలు ఇవ్వనున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి ఆలోచనలు, మార్గదర్శకత్వానికి అనుగుణంగా మేడారాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

మేడారానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు ములుగు జిల్లా, నియోజకవర్గ ప్రజల తరఫున పేరుపేరునా స్వాగతం పలుకుతున్నామని మంత్రి సీతక్క తెలిపారు.

ఆదివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి మేడారం ఆలయ ప్రాంగణంలో పర్యటించనున్న నేపథ్యంలో భక్తులు, స్థానిక ప్రజలు అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొన్నారు.

వనదేవతలను దర్శించుకున్న అనంతరం శ్రీ సమ్మక్క--సారలమ్మ సన్నిధి నుంచి అర్హులైన ఒంటరి, వితంతు మహిళలకు పింఛన్లు అందించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారని మంత్రి తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించాలనే లక్ష్యంతో సంతృప్తి స్థాయిలో పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. ఆగస్టు 31వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించి, అర్హులను గుర్తించి పింఛన్లు అందించాలన్నది ముఖ్యమంత్రి ఆలోచన అని తెలిపారు. సమ్మక్క--సారలమ్మ తల్లుల దీవెనలతో ప్రతి మహిళ సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించాలన్న సంకల్పంతో

ఈ కార్యక్రమాన్ని వారి సన్నిధి నుంచే ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఏటూర్ నాగారం ఏ.ఎస్.పి మనన్ భట్, జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, గుత్తేదారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణకు భారీగా తరలిరావాలి మంత్రి పొన్నం

హైదరాబాద్ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సులు, ఇతర స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అదే విధంగా 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకం ద్వారా బీసీ మహిళలకు ఇంటి నుంచే ఆదాయం పొందే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు.

బీసీ సంక్షేమ శాఖ ద్వారా ఆత్మగౌరవ భవనాలకు నిధులు కేటాయిస్తూ, వాటి నిర్మాణాలను పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. ఇటీవల బలహీన వర్గాల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి బీసీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని చెప్పారు. కులగణన అనంతరం బీసీల అభివృద్ధికి సంబంధించిన తదుపరి కార్యాచరణను ముందుకు తీసుకెళ్తామని మంత్రి పేర్కొన్నారు.

పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణకు భారీగా తరలిరావాలి

ఈనెల 14వ తేదీ సాయంత్రం 4 గంటలకు హెచ్ఎండీఏ గ్రౌండ్స్ ఎదురుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ చాంపియన్గా నిలుస్తోందని, మహాత్మా జ్యోతిబాపూలేను స్మరించుకుంటూ ప్రగతి భవన్ను "మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్" గా, సచివాలయాన్ని "డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం""గా పేరు మార్చినట్లు తెలిపారు.

అలాగే ఈనెల 18వ తేదీన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ట్యాంక్బండ్పై ఆయన విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారని మంత్రి తెలిపారు. ఈ

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com